ప్రజాశక్తి

Vol. 4, no. 24

(Jun. 14, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 24

(Jun. 14, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0.2.0


ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 24

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 14-6-44



★ యుద్ధసమీక్ష

రెండవరంగం

— తుమ్మల వెంకటరామయ్య

రెండవ రంగం ప్రారంభమయింది. ప్రపంచ చరిత్రలో అతిప్రధానఘట్టం ప్రారంభమయింది. హిట్లరు నాజీముఠా రోజులు సమీపించాయి. యూరప్‌విముక్తి ఇంకెంతో దూరానలేదు.

రెండవరంగం ప్రపంచప్రజలకొక ముఖ్య విజయం. టెహరాన్ సమావేశంలోని నిర్ణయాలను ఎలాగయినా అమలుజరగకుండా చేయాలనీ, కాలయాపనచేయాలనీ, ప్రయత్నించిన అభివృద్ధి నిరోధకులకిది ఒకగొడ్డలిపెట్టు టెహరాన్ నిర్ణయాలలో ముఖ్యమైన రెండవరంగం ప్రారంభమయింది.

సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుఝామున (జూన్ 5, 6) ఫ్రాన్సుపై మిత్రరాజ్య దండయాత్ర ప్రారంభమయింది. నాల్గువేల నౌకలు, 11 వేల విమానాలు, ఇంకా ఎన్నో చిన్నచిన్న సహాయక నౌకలతో బ్రిటిష్ - అమెరికన్ - తదితర మిత్రరాజ్య సైన్యాలు ఇంగ్లీషు ఛానలు దాటాయి. జనరల్ ఐసన్‌హోవర్ పర్యవేక్షణక్రింద, జనరల్ మాంట్‌గోమరీ నాయకత్వాన మిత్రసైన్యాలు ఫ్రాన్సుకోస్తాలో దిగాయి. సీన్ నదీ ముఖద్వారాన ఉన్న లాహావ్రీవద్ద మిత్రసైన్యాలు దిగాయి. లాహావ్రీ - చెర్బర్గుల మధ్యకోస్తాలో 75 మైళ్ళ వెడల్పున మొదట మిత్రసైన్యాలు కాలుపెట్టాయి.

నౌకలలో దిగుతున్న మిత్రసైన్యాలకు సహాయంగా విమానాలద్వారాగూడా సైన్యాలు దిగుతున్నాయి రెండుడివిజన్లు ఇలా విమానాలద్వారా ఫ్రాంసుకోస్తాకు చేర్చబడ్డాయి. దండయాత్రకు పూర్వము, తర్వాత కూడ మిత్రవిమానాలు జర్మను కీలకస్థానాలపై తీవ్రంగా దాడిచేశాయి. ఒక్కొక్కసారి వెయ్యేసిబాంబర్లు ఈదాడులలో పాల్గొన్నాయి.

మొట్టమొదట మిత్రసైన్యాలకు వశమయిన ముఖ్యస్థానం బాయో. ఇది పారిస్‌నుండి, కేన్‌గుండా చెర్బోర్గుకు వెళ్లే రోడ్డుమీదవుంది. ఇప్పుడు ఇదే రోడ్డుమీద బెర్సీర్స్, ఇసినీ లనుకూడ మిత్రసేనలు వశపరచుకొన్నాయి. అంటే బాయోనుండి ఇసినీవరకు పూర్తిగా ఈరోడ్డు మిత్రసైనికులచేతిలోవుంది. జర్మన్లు మిత్రసైన్యాలను పురోగమించకుండా చేయడానికి ఈప్రాంతంలో ఆనకట్టలను తెగగొట్టి, నదులను ప్రవహింప జేశారు. ఇపుడు వైర్ నదీ ముఖద్వారంలోఉన్న ఇసినీకి పశ్చిమంగా కారంటన్‌వద్ద భీకరంగా యుద్ధం జరుగుతోంది. కేన్ పొలిమేరలలోకూడ ప్రచండంగా యుద్ధం సాగుతోంది. హఠాత్తుగా కొట్టిన దెబ్బకు విస్మయపడిన శత్రువు ఇప్పుడు గుండె దిటవుపరచుకొని తీవ్రంగా ఎదుటపడి నిలుస్తున్నాడు. 3 టాంకుదళాలను ఉపయోగించి ప్రచండంగా ఎదురుదాడులు సాగిస్తున్నాడు. మిత్రసైన్యాలు 2 లక్షలు ఇప్పటికి యుద్ధంలోకి దిగినవని పారిస్‌రేడియో అంటుంది. 2½ లక్షలుంటుందని మరికొందరి అంచనా. జర్మన్లుకూడా దాదాపు ఇంతవుంటారని ఊహించబడుతుంది.

ఎంతటి భయానకయుద్ధాలు గావించవలసి వచ్చినా, ఎన్నిరక్తస్రవంతులు ప్రవహింపజేయవలసివచ్చినా, రానున్న ఫలితమేమోస్పష్టమే. అది ఫ్రాంసు విముక్తి; ఆతర్వాత యూరప్ విముక్తి. ఎన్నాళ్ళనుండో ఫ్రెంచి గెరిల్లా యోధులు - చిత్తశుద్ధిగల ఫ్రెంచి దేశభక్తులందరూ ఈ సుదినంకోసం వేచియున్నారు. ఫ్రాంసు అంతటా రహస్యసైన్యం నిర్మించబడివుంది. ఈ సైన్యప్రతినిధులు ముగ్గురి మధ్య ఆల్జీర్సు (ఫ్రెంచిఆఫ్రికా)కు వచ్చారు. దాదాపు 10 జర్మనుడివిజన్లకు ఈ రహస్య సైన్యం పని కల్పించగలదు. గత సంవత్సరం, ఇటలీ లొంగిపోయినపుడు జర్మను సైన్యాలను వెనక్కిపోకండా రెండురోజులు అపగల్గారీ సైనికులు. ముఖ్యరహదారులను ఆరుసార్లు తెగగొట్టారు. డిగాల్ అపుడే లండన్‌నుండి, ఫ్రెంచివారిని మిత్రసైన్యాలకు సహాయంచేయండని సందేశమిచ్చారు.

ఫ్రెంచి గెరిల్లా లప్పుడే మిత్రసైన్యాలకు సహాయం చేస్తున్నాయి. గెరిల్లా నాయకులకు తప్ప వీరివిషయం ఇంకొకరికి తెలియదు. మిత్రసైన్యాలు దిగగానే, వీరు చిన్నచిన్న జర్మను ముఠాలను హతమార్చారు. టెలిఫోనుతీగలనుత్రెంచారు. బ్రిడ్జీలక్రింద మందుపాతరలను పెట్టారు. ఫ్రాంసు ఆగ్నేయభాగంలో జర్మను పెట్రోల్‌ను, ఆయుధసామగ్రిని, రైల్వేలను, ఫ్యాక్టరీలను, టెలిఫోను తీగెలను, ధ్వంసంచేస్తున్నారని స్విస్ పత్రికలు వ్రాస్తున్నాయి కొంతమంది ఫ్రెంచి సైనికుల నాయకత్వంక్రింద ఫ్రెంచి గెరిల్లాలు లక్షీవారంరాత్రి గ్రెనోబుల్ అనే నగరాన్ని చుట్టుముట్టారనీ, అక్కడి జర్మన్ సేనలతో తలబడి ఈ దేశభక్తులు తీవ్రపోరాటాలు సాగిస్తున్నారనీ, స్విట్జర్లండు పత్రికలు తెలుపుతున్నాయి. స్విట్జర్లండు సరిహద్దుకు సమీపంలో ఉన్న బెల్లాగార్డి అనేచోటకూడా తీవ్రపోరాటాలు సాగుతున్నాయట. అక్కడ దేశభక్తుల నెదుర్కోడానికి జర్మనులు ప్రత్యేకసైనికదళాలను అదనంగా తేవలసివచ్చిందట. ఆ చుట్టుప్రక్కలనున్న ఫ్రెంచి పోలీసులను కూడా జర్మనులు పిలువబోయారు. కాని వీరిలో చాలమందీ, లావల్ ప్రత్యేక పోలీసు దళాలూ పోయి దేశభక్తులతో చేరారనివార్త.

ఈవిధంగా ఫ్రెంచిదేశభక్తులు మిత్రసేనల పురోగమనానికి రహదారిని శుభ్రపరుచుతున్నారు.

మిలిటరీ ప్రభుత్వం ఉండదు

ఇటలీలో, మిత్రసైన్యాలు దిగగానే, మిత్రరాజ్య మిలిటరీ ప్రభుత్వం (అమ్‌గాట్) ఏర్పడి, ప్రజాశక్తుల విజృంభణ నరికట్టింది. అభివృద్ధిశక్తులన్నీ ఆ ప్రభుత్వాన్ని ఖండించాయి. ఫ్రాన్సులోకూడా అలాంటి మిలిటరీ ప్రభుత్వమే, విముక్తిచెందిన ప్రదేశంలో ఉంటుందా? ఏప్రిల్ 9 వ తేదీన ఉపన్యాసంలోనే కార్డెల్‌హల్ ఇలాఅన్నాడు, "వీలయినంత త్వరలో, ఫ్రెంచివారి అధ్వర్యాన పౌరఅధికారం ఏర్పరచాలి. నేషనల్ లిబరేషన్ కమిటి (ఫ్రెంచి స్వాతంత్ర్య కమిటీ) ఆధ్వర్యాన శాంతిభద్రతలు ఏర్పరచడానికి ప్రయత్నించుతాం."

జనరల్ ఐసన్‌హోవర్ కూడా "ఫ్రెంచి ప్రజలే పౌరఅధికారాన్ని స్వీకరించి, శాంతిభద్రతలను బాగా కాపాడుటద్వారా నా సైనికులకు రక్షణనీయండి."అనిఅన్నాడు.

కాని డీగాల్ ప్రకటనచూస్తే, ఇంకా నాజీ దురాక్రమణనుండి విముక్తిచెందిన ప్రదేశాల పరిపాలన విషయమై ఎలాంటి స్పష్టప్రకటనా లేదు. ఫ్రెంచి స్వాతంత్ర్య కమిటీతో మిత్రరాజ్యాలీ విషయమై ఎలాంటి ఒడంబడికను గావించుకోలేదని డిగాల్ తెలియజేస్తున్నాడు.

త్వరలోనే మిత్రరాజ్యాలీ వైఖరిని మార్చుకోక తప్పదు. ఇటలీవలెనే, ఫ్రాంసులోకూడ ప్రజల విజయం తప్పదు.

తమ విముక్తికై పోరాడే మిత్రసైన్యాలకు అండగా తమ శాయశక్తులా సహాయం చేయడానికి ఫ్రెంచి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మూడేండ్లనుండి వారీ సుదినం కోసం వేచియున్నారు. ఫ్రెంచిప్రజ లీనాడేకముఖంగా నిలబడి నాజీరాక్షసులను, వారి తొత్తులను కూలదోసి తమ మాతృదేశ స్వాతంత్ర్యాన్ని పొంద సిద్ధంగా వున్నారు. అలాంటి ప్రజలకు పరిపాలనాధికారం ఇవ్వకుండా మిత్రరాజ్యాలు తప్పించుకోలేవు.

(మిగతా 2 వ పేజీలో)



మిత్రసేనల సర్వ సైన్యాధిపతి — జనరల్ ఐసన్ హోవర్

బుధవారం ప్రజాశక్తి 14-6-44

యూరప్ పై దండయాత్ర

అబ్బ! ఎంతకాలంనుంచో ప్రపంచ ప్రజలందరూ ఎదురుచూస్తున్న రెండవ రంగం చివరికి ప్రారంభమయింది.

3 సంవత్సరాలనుంచి ఒంటరిగా నిలబడి నాజీదురాక్రమణదారులను ఎదుర్కొని ఓడిస్తున్న సోవియట్ సైన్యాలకు తోడుగా మిత్రరాజ్యబలాలు పశ్చిమ యూరపులో దిగినయి. రెండువైపులనుంచి పొంగిపొరలివచ్చే మిత్రరాజ్యబలాల అలకత్తెరలో హిట్లరు పతనం కన్పిస్తోంది.

సోవియట్ - జర్మన్ యుద్ధరంగంలో చిక్కుకుని నలిగిపోతూ తీవ్రపరాజయాలకు గురి అవుతున్న హిట్లరు మూకలకు ఈ రెండవరంగంతో చావుమూడిందనే చెప్పవచ్చు. హిట్లర్ పతనం ఇంక ఎంతోకాలం పట్టదు. హిట్లరు కాళ్ళక్రింద పడి నలిగిపోతున్న యూరపియన్ ప్రజల విముక్తి గూడా ప్రారంభమయింది.

సర్వశక్తులు వినియోగించి హిట్లరును ఎదుర్కొనుటకు మేము సాగించే యుద్ధంతోపాటు పశ్చిమయూరపులో రెండవరంగమే ప్రారంభిస్తే, 1942 లోనే హిట్లర్ పతనం తప్పదని సోవియట్ విదేశాంగమంత్రి మాలటోవ్ 1941 లో హెచ్చరించాడు. 42, 43 గడిచినయి. 44 ఫిబ్రవరిలో రెడ్ ఆర్మీ 26 వ వార్షికోత్సవంలో మాట్లాడుతూ స్టాలిన్ "ఒంటరిగా నిలబడి మనమే ఫాసిస్టులకు ఇన్ని పరాజయాలు కల్గిస్తున్నప్పుడు, రెండవరంగమే ప్రారంభమయితే, త్వరలో హిట్లర్ సర్వనాశనమవుతాడు" అన్నాడు.

సోవియట్ విజయాలు, ఆ విజయాలతోపాటు వృద్ధిఅవుతూ వచ్చిన యూరపియన్ ప్రజల విజృంభణ, ప్రపంచప్రజల ఆందోళన — ఇవన్నీ అభివృద్ధినిరోధకుల ప్లానుల నన్నిటినీ భగ్నంగావించి, రెండవరంగాన్ని ప్రారంభింప జేసినయి. రెండవ రంగం ప్రపంచప్రజల కొక మహత్తర విజయం.

సోవియట్ సైన్యాలచే దెబ్బమీదదెబ్బతింటూ, తెప్పరిల్లుకొనుటకు వీల్లేకుండా ఉన్న హిట్లర్‌కు రెండవరంగం చావుదెబ్బగా పరిణమించక తప్పదు. చూడండి: జూన్ 5 వ తేదీ రాత్రి ఒక్కసారిగా 10,000 టన్నుల బాంబులవర్షం; ఫ్రెంచి తీరాన ఉన్న జర్మన్ రక్షణలమీద 13,000 బాంబర్ల దాడి; 11,000 విమానాల రక్షణక్రింద 2-3 లక్షల మిత్రరాజ్య సైన్యాలు దిగటం — బ్రహ్మాండమైన ఈ సమీకరణ అంతా హిట్లర్ సైన్యాధిపతులను గడగడలాడించినయి

"అమోఘమైన సైన్యంతోనూ, యుద్ధసామగ్రులతోనూ బయలుదేరిన రెండవరంగంలో మిత్రబలాలకు విజయం తప్పదు" అన్నాడు కర్నల్ ఆల్‌ఫ్రెడ్ ఫోన్ ఓల్‌బర్గ్. జర్మను సైన్యాలనుగురించి ప్రగల్భాలు కొట్టే కెప్టన్ లూడ్విగ్‌ఫోన్ సార్టీరియస్ ధోరణి మారింది. "రెండవరంగంలో ఏకైకదృష్టితో మిత్రరాజ్య బలాలను ఎదుర్కొంటున్న జర్మన్ సైన్యాల నైతికబలం ఒక గొప్పవిషయం. యుద్ధరంగంలో సైన్యాలు, సామగ్రులేకాదు ముఖ్యవిషయములు. నైతికబలంగూడ ఒక ప్రధాన విషయం" అంటాడు!

నైతికబలం! పిశాచి మూకలవలె యూరపియన్ ప్రజలమీద పడి ఎన్నో ఘాతుకకృత్యాలను గావించిన జర్మన్ సైన్యాధిపతులు నైతికబలాన్ని గురించియా మాట్లాడటం! నైతిక నిబ్బరం క్షీణించి ఆఖరిదశకు వస్తున్న వీరికి నైతికబలం యొక్క ఆవశ్యకత ఇప్పటికి గోచరమవుతోంది పాపం!

సైనికుల మనోనిబ్బరాన్ని నిలబెట్టుటకై హిట్లరే స్వయంగా రెండవ రంగంలో సర్వసైన్యాధిపతిపదవిని స్వీకరించాడు. ఫలితం? స్టాలిన్‌గ్రాడ్‌లో ఇలాగే ముందుకు వచ్చినప్పుడు ఏమైంది? చావుదెబ్బలతో వెనక్కుపోయాడు. ఈసారి గూడా అంతే.

ఈలోపల ఆక్రమిత యూరపులో ప్రజలందరూ లేస్తున్నారు. 3 సంవత్సరాలక్రితం హిట్లర్ తమదేశాన్ని ఆక్రమించినప్పటినుంచి తిరుగుబాటు రోజుకై తయారై కనిపెట్టుకొనియున్న ఫ్రెంచి ప్రజలు ఒక్కసారిగా విజృంభిస్తున్నారు. ఫ్రాన్సులోనేకాదు, హిట్లర్ ఆక్రమించిన అన్నిదేశాల్లో ఇదే పరిస్థితి. యుగోస్లావియా, గ్రీస్, పోలెండు, బాల్టిక్ దేశాలు, నార్వే, హాలెండు, డెన్మార్కు.... అన్నిచోట్ల తిరుగుబాట్లే!

రోమ్ నగరాన్ని ఆక్రమించిన మిత్రసైన్యాలు ఇటలీలో ముందుకు సాగిపోయి, దక్షిణంనుంచి జర్మనీని సమీపిస్తున్నాయి.

తూర్పురంగంలో రెడ్‌ఆర్మీ నూతన ఉత్సాహంతో పురోగమిస్తోంది. రుమేనియాలో మందగించిన జాసీ యుద్ధరంగంలో రెడ్‌ఆర్మీ ముందుకు కదలిపోతోంది. జూన్ 11 వ తేదీన రెడ్‌ఆర్మీ మరొక యుద్ధరంగాన్ని ప్రారంభించింది. బాల్టిక్ ప్రాంతంలో మొదటినుంచి పాతుకొనివున్న నాజీమూకలను చెండాడుటకు, కెరీలియన్ సరిహద్దులను 25 మైళ్ళ పొడవున 15 మైళ్లు పురోగమించినవి.

ఈవిధంగా అన్ని దిక్కులనుంచి, క్రిందినుంచి, మీదినుంచి అనేకరంగాలు బయలుదేరి హిట్లరు దురాక్రమణదారులకు సర్వనాశనంచేసే పరిస్థితులు వచ్చినాయి. రెండోరంగం యెన్నో కొత్తరంగాలకు దారితీస్తోంది.

రెండవరంగంతో హిట్లరుకు రోజులు దగ్గరపడినాయి. హిట్లరు ఓటమితో జపాను వెన్నెముక విరిగినట్లే. ఫాసిస్టుల సర్వనాశనముతో విముక్తి అవుతున్న యూరపియన్ ప్రజలు, ప్రపంచ పెత్తనానికై ఇంకా ప్లానులువేసే సామ్రాజ్యవాదుల యెత్తులను భగ్నం చేస్తూ, ప్రపంచప్రజల స్వాతంత్ర్యానికి దారితీస్తున్నారు.

రెండవరంగం ప్రారంభించకుండా హిట్లరుతో రాజీచేసికోవాలనే ద్రోహులు ప్రజలచేతిలో ఓడిపోయారు. అదేవిధంగా భారత ప్రతిష్టంభనా పరిష్కారాన్ని నిరోధించిన అమెరీముఠాను ఓడించి గాంధీజీ విడుదలను మనం సాధించాం. ఇక భారత స్వాతంత్ర్యాన్నికోరే దేశభక్తులందరం ఏకమవుదాం. కాంగ్రెస్-లీగుల ఐక్యతను సాధించి, జపాన్ దుండగీడులను ఎదిరించుదాం. స్వాతంత్ర్య కాముకులమైన మనం ప్రపంచ స్వాతంత్ర్యంకొరకు జరిగే యుద్ధ విజయంకోసం నెరవేర్చాలసిన కర్తవ్యమిదే!

ఇటలీలో ప్రజా ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

రోం విజయంతో మిత్ర సేనల పురోగమనం ఆగలేదు. జర్మను సైన్యాలకు విశ్రాంతి నీయకుండా వెన్నంటి తరుముతునేవున్నాయి. టైబర్‌నదిని దాటిన పంచమసైన్యం వేగంగా ముందుకుపోయింది. రోంకు వాయువ్యంగా 57 మైళ్ళలో ముఖ్యపట్టణాలను పట్టుకొంది. అష్టమసైన్యం టైబర్‌నదికి తూర్పుగామిగిలిన శత్రువులనువెన్నంటితరుముతోంది. ఆడ్రియాటిక్ సముద్రతీరాన పెస్కారాను భారతసైనికులు పట్టుకొన్నారు. మిత్రసైన్యాలు ఉత్తర ఇటలీలో ద్విగుణీకృత వేగంతో ముందుకు నడిచి జర్మను దక్షిణ సరిహద్దులో దెబ్బగొట్టాలి. అంతేగాక అటు యుగోస్లావియాలోని టిటో సైన్యాలతో సంబంధం పెట్టుకోవాలి. "రెండవరం ఏర్పడగానే మేము జర్మనీపై ఎదురుదాడులు సాగించుతామ"న్నాడు టిటో. టిటోతో గలసి మరొకప్రక్క జర్మనీపై దెబ్బతీయాలంటే, ఉత్తర ఇటలీలో త్వరితంగా విజయాలు సాధించాలి. ఆ ఆశయంతోనేమిత్ర సేనలుముందుకుపోతున్నాయి.

మిత్రసేనల పురోగమనానికి, ఉత్తర ఇటలీలో గెరిల్లా సైన్యాలకు, ఇపుడు ఇటలీలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం బాగా చేయూతను ఈయగల్గుతుంది

రోమ్ విముక్తితో, ఇటాలియన్ ప్రజల దాస్యవిముక్తికూడ ప్రారంభం అయింది. ఇటాలియన్ రాజు విక్టర్ ఎమాన్యుయల్ సింహాసన పరిత్యాగం చేశాడు. అంబర్టో యువరాజు ఆపదవిని స్వీకరించాడు. ఇంతేగాదు. బడోలియోకూడ రాజీనామానిచ్చాడు. నేషనల్ లిబరేషన్ కమిటీ (ఇటలీ స్వాతంత్ర్యకమిటీ) కి అధ్యక్షుడైన సీనార్ బొనోమీ ప్రధాని అయ్యాడు. అతడే వివిధపక్షాలతో గూడిన మంత్రివర్గాన్ని ఏర్పరిచాడు. ఇందులో కమ్యూనిస్టు అయిన సీనార్ పాల్మిరో టోగ్లియాటీ కూడా ఉన్నాడు. ఈ నూతన మంత్రివర్గం, ఇదివరకులా రాజవంశానికి వినయవిధేయతలు తెలిపే రాజభక్తి ప్రమాణాన్ని తీసుకోదు. మాతృదేశానికి భక్తివిశ్వాసాలను తెలిపే కొత్త ప్రమాణాన్ని తీసుకొంటుంది. ఈవిధంగా ఇటలీ చరిత్రలో ఒక కొత్తఅధ్యాయం ప్రారంభమైంది. ఇటలీ ప్రజారాజ్య ప్రథమ సోపానం ఏర్పడింది.

ఫిన్లండు విముక్తికి -

సోవియట్ యుద్ధరంగంలో, జర్మన్లు చేసిన తిరుగుదాడులేమీ ఫలించలేదు. రుమేనియా సరిహద్దున జాస్సీవద్ద జర్మన్ల తిరుగుదాడి విఫలమైంది. గతసంవత్సరం జూలైలో కుర్స్కువద్ద కూడ నాజీలు ఈవిధంగానే రెడ్‌ఆర్మీ సన్నాహాలను భగ్నంచేయడానికి ఆఖరిప్రయత్నం చేశారు. కాని ఫలించలేదు. ఈ సంవత్సరం జాస్సీవద్ద కూడా అలాగే జరిగింది.

పశ్చిమంగా మిత్రసైన్యాల దాటికి గురి అవుతున్న నాజీలకు తూర్పున ఊపిరాడ నిస్తారా? లేదు. జనరల్ ఐసెన్‌హోవర్ రెండవరంగం ప్రారంభించే సమయంలో ఇచ్చిన సందేశంలో, "మన రష్యన్ మిత్రులతో సంయుక్తంగా యూరప్ విముక్తికై వేసిన ప్లానులోని భాగమే ఈదండయాత్ర" అని అన్నాడు. అందుచే అటుతూర్పునుండికూడ ఇదివరకెన్నడూ కనివిని ఎరుగని బ్రహ్మాండ యుద్ధాలను రెడార్మీ సాగించగలదు. ఆఖరివార్తలలో కామ్రేడ్ స్టాలిన్ సోవియట్ సైన్యాలు ఫిన్లండుపైకి పురోగమించుతున్నాయని తెలియజేశాడు. కెరిలియన్ భూసంధిలో 25 మైళ్ళ వెడల్పున సోవియట్ సైన్యాలు ముందుకుపోయాయి. 15 మైళ్ళ లోనికి చొచ్చుకుపోయాయి. 80 ప్రదేశాలకు విముక్తినిచ్చాయి. ఇన్నాళ్లూ ఫిన్నిష్‌ప్రజల మనోభిప్రాయానికి విరుద్ధంగా ప్రవర్తించి, సోవియట్ సూచించిన శాంతిని కాలదన్ని, హిట్లరు తొత్తుగా ప్రవర్తించుతున్న మానర్‌హీం అంతిమ ఘడియలు సమీపించాయి.

సోవియట్ ఈ ఒక్క రంగంలోనేగాక, ఇంకా అనేకచోట్ల దెబ్బగొట్టవచ్చు. డాక్టర్ బెనిష్ (జకోస్లోవేకియా అధ్యక్షుడు) తన దేశస్థులకిచ్చిన రేడియోసందేశంలో త్వరలోనే బాల్కన్లపైన, జర్మను నడిగడ్డపైన కూడ దండయాత్ర సాగుతుందని అన్నాడు. సోవియట్‌సైన్యాలు తూర్పు గలీషియానుండి జకోస్లోవేకియాగుండా జర్మనీకి, రుమేనియాగుండా డాన్యూబ్‌కు బాల్కన్‌రాజ్యాలకు, జైత్రయాత్ర ప్రారంభించుతాయని అన్నాడు. ఇది సోవియట్‌సైన్యాల అంతిమదాడి కూడా అన్నాడు. ఈవిధంగా మిత్రరాజ్యాలు సంయుక్తంగా కొట్టేదెబ్బలవల్ల నాజీజర్మనీ వినాశం ఇంకా ఎంతోదూరానలేదు.

12—6—44.

ఆంధ్రలో ఆహారసమస్య

కొండపల్లిలో

రోజురోజుకూ ఆహారసమస్య ఎలా తీవ్రమౌతున్నదో, మన కండ్లముందరే అధికపంటపండే జిల్లాలో సైతం బియ్యపుకొరత ఎలా ఏర్పడుతుందో, తెలుసుకోడానికి కొండపల్లి ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ గ్రామంలో ఫిర్కా రైతుసంఘ అర్గనైజరు కృషిని వివరించే అతని డైరీనిస్తున్నాం.

కొండపల్లిలో పరిస్థితులిం‌తమాత్రానే చక్కబడ్డవని ఎంచరాదు. గ్రామపెద్దలతో ఆహార కమిటీ నేర్పరచాలి. గ్రామ రైతుసంఘాన్ని బలపరచాలి. యువజనులను ప్రజారక్షణదళంలో చేర్చి, ఆహార పంపకంలో పనిచేసేటట్లు చేయాలి. వర్తకులలో గూడ, న్యాయమైన లాభాలు మాత్రం తీసుకొంటూ బియ్యం అమ్మాలని, అధిక లాభాల కాశించి దేశానికి హానిచేయవలదని దేశభక్తిని ప్రబోధించాలి. సం.]

బెజవాడ తాలూకా కొండపల్లిగ్రామ జనాభా దాదాపు 5 వేలుంటుంది ఎక్కువమంది కుండలు, బొమ్మలు చేయుట, అడవికర్ర కొట్టుకొనుటద్వారా జీవించుతూ వుంటారు. కొండపల్లి ఫిర్కాలో కేంద్ర గామం. కొండపల్లి ఫిర్కాలో వర్జీనియా పుగాకు ఎక్కువగా వేస్తున్నారు. అందుచే ఆహారపదార్థాలకు కొంతవరకు ఇతర ప్రదేశాలమీద ఆధారపడాలి.

ఏప్రిల్ నెలాఖరువరకు ఇక్కడంతా సవ్యంగానే నడిచింది. మే మొదటివారంలో బియ్యంకరువు తలసూపింది. బియ్యందర పెరిగింది. రూపాయికి 2½ శేర్లుకూడా అమ్మారు. మే 12 వ తేదీన బియ్యం దొరకదంలేదనుండి గగ్గోలు బయలుదేరింది.

ఎందువల్ల ఈ అలజడివచ్చింది? మే 10 వ తేదీని రూపాయకు 4 శేర్లు చొప్పున బియ్యం అమ్మాలని, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వర్తకులకు తెలియజేశాడు. దీనితో వర్తకులు బియ్యం దాచివేశారు. రాత్రిళ్లు రూపాయికి 2½ శేర్లు చొప్పున అమ్మకం సాగించారు. కంట్రోలు ధరకు అడిగినవారికి బెజవాడలోనే బియ్యం లేవు పొమ్మన్నారు. ఇలాంటి పరిస్థితులలో 12వ తేదీరాత్రి కొండపల్లి చేరాను. బజార్లలో కంట్రోలు, రేషనింగులకు వ్యతిరేకంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ గ్రామంలో రైతుసంఘం అంతబాగా చొచ్చుకుపోలేదు. రైతువర్కర్లుగాని, ఇతర యువకులుగాని, తగినంతగాలేరు. అయినా, ఈ విషయంలో గట్టిగా పనిచేయాలని నిశ్చయించుకొన్నాను. రెవిన్యూ ఇన్‌స్పెక్టరును కలసి కొందామని వెళ్ళాను. కాని అయన ఊళ్లోలేడు.

13—5—44

ఉదయం రెవిన్యూ ఇన్‌స్పెక్టరును కలిసికొని బియ్యపుకొరత పరిస్థితిని చర్చించాను. బియ్యపు వ్యాపారస్తులను కలసికొని, మేము మాట్లాడాం. 4 శేర్లు చొప్పున అమ్మడానికి గిట్టుబాటు కావన్నారు. విధిలేక కొట్లను సోదా చేయవలసివచ్చింది. 4 కొట్లలో 6 బస్తాల బియ్యం దొరికాయి. ఈ ఆరుబస్తాలను కూలీలకు రూపాయికి 4 శేర్ల చొప్పున కొలిపించాం. కాని, కొన్ని కొట్లలో ఇదివరకే బియ్యం దాచేసినందున బియ్యం దొరకలేదు. తమ యిండ్లలో కూడ లేకుండా వర్తకులు బియ్యాన్ని దాయగలిగారు.

బియ్యపుసప్లయికి పిటిషను పెట్టడానికిగాను వర్తకులతోకలసి కలెక్టరువద్దకు వెళ్ళుతున్నానని రెవిన్యూఇన్‌స్పెక్టరుగారు తెలియజేశారు.

ఆరోజురాత్రి బియ్యంవర్తకులు తమసొత్తుల్ని బయటకు దాటించేస్తారనే భయంతో 18 మంది కూలీయువకుల్ని, 4 గురు మహమ్మదీయుల్ని సాయంకాలంతీసుకొన్నాను. 3 దళాలుగా ఏర్పడి పూరుచుట్టూ ఆరాత్రికావలావున్నాం. 14 వ తేదీ ఉదయం కూడా అనుమానమున్న వర్తకుల ఇండ్లు కావలా కాశాం.

14—5—44

రెవిన్యూ ఇన్‌స్పెక్టరు, వర్తకులు కలెక్టరువద్దకు వెళ్లారు. ఆ పూట బియ్యంలేదు. కొందరు లూటీ చేద్దామనే భావానికి వచ్చారు. లూటీలు ఎలా ఆహార సమస్యను పరిష్కరించవో, పైగా ప్రభుత్వ నిర్బంధానికి, ఎలాదారితీస్తుందో, ప్రజలందరూ తిండిలేక ఎలాబాధపడవలసి వస్తుందో బోధపరిచాను. ఎవరి నోటిమీద విన్నా "ఈరోజు తిండిఎట్లా" అన్న ప్రశ్నే.

ఈ రెండురోజులపని ఫలితంగా కొందరు యువకులు ఉత్సాహంగా నాకు తోడ్పడ్డారు. దొంగతనంగా దాచినబియ్యం బయటకు లాగడానికి పోలీసుల సహాయం అవసరమని ఆయువకులూ మేమూ నిశ్చయించుకొని సబ్ ఇన్‌స్పెక్టర్‌వద్దకు వెళ్లాం. కావలాకాసిన ఇండ్లలో సోదా జరిగింది. 6 బస్తాలు మాత్రం బియ్యం దొరికింది. కాని ఇవేం చాలతాయి? అందుచే వడ్లున్న వారివద్ద వడ్లు ప్రోగుచేసి బియ్యంచేయించి అమ్మించడానికి నిశ్చయిచాం.

కంట్రోల్‌రేటుకే అమ్మండని విజ్ఞప్తి చేశాం. 26 బస్తాలధాన్యం వచ్చింది. బియ్యం చేయించి ఫ్యాక్టరీ ఆవరణలోనే అమ్మించాం. కాని ఒక లోపం జరిగింది. బియ్యం పట్టించినపుడు వలంటీర్లు దగ్గరగాలేరు. అందుచే బియ్యంలో చిట్టు, పూక కలిపి పట్టబడి జేశారు. వర్తకులు చీకటిలో చూడకుండా కొల్వడంవల్ల కొంతగోల బయలుదేరింది.

15—5—44

బెజవాడనుండి బియ్యం రాలేదు. మరల 6 బస్తాలవడ్లు ప్రోగుచేసి, వాలంటీర్లసాయంతో అమ్మాం.

16—5—44

కలెక్టర్ ఆర్డరువల్ల కొండపల్లికి 50 బస్తాల బియ్యం వచ్చాయి. రెవిన్యూ ఇన్‌స్పెక్టరు మమ్మల్ని పిలిపించి, "ఇవి 15 రోజులకు ఉద్దేశింపబడినాయి. ఏం చేయాలి?" అని అన్నారు. మొదటవచ్చిన బియ్యాన్ని సక్రమంగా పంపకం అయేటట్లు చూడాలనుకున్నాం. తర్వాత కొత్తబియ్యానికి ప్రయత్నించవచ్చు అని మానిశ్చయాన్ని తెలియజేశాను.

ఇప్పటివరకు బియ్యం ఒకపద్ధతిని పంపకంగావడంలేదు. ఇంతవరకు లెక్కలు తయారుకాలేదు. తాత్కాలికంగా కిరోసిన్ రేషన్‌కార్డుల ననుసరించి సప్లయిచేద్దామనుకొన్నాం. బాకాలద్వారా ఈ విషయం గ్రామంలో ప్రచారంచేశాము. ఆరకంగా పంపకంసాగించాం. ఇంతలో మరి 70 బస్తాల బియ్యంవచ్చాయి. రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగారు తమపని పూర్తి అయిందనుకొన్నారు. పని అంతా మేమేచేయవలసివచ్చింది.

17—5—44

బియ్యం నాల్గుకొట్లలోఅమ్మునట్లు ఏర్పాటు చేశాం. బియ్యం ఇతరచోట్లకు పోకుండా కావలా పెట్టాం. కిరోసిన్ రేషన్ కార్డుల ననుసరించి బియ్యంకూడా పంపకం చేయడంలో న్యాయం జరగడంలేదని అనుభవమైంది. అందుచే రూపాయికి ఎక్కువ బియ్యం ఎవరికీ అమ్మకూడదని నిర్ణయించాం.

19—5—44

ఒక కొట్లో రూపాయికి పావుశక్కువ నాల్గు శేర్లు చొప్పున 8 రూపాయల బియ్యం అమ్మినట్లు తెలిసింది. వెంటనే, అక్కడకువెళ్లి, తిరిగి పావుశేరు చొప్పున కొన్నవారికి ఇప్పించాం. ఇప్పుడు ఇండ్లవారీగా లెక్కలు తయారుచేస్తున్నాం. లెక్కలు తయారుకాగానే రేషన్‌కార్డులిచ్చి వాటి ప్రకారం బియ్యం అమ్మేటట్లు ప్రయత్నించుతాం.

కాతినేని రామకోటయ్య,
కొండపల్లి ఫిర్కా రైతుసంఘ
అర్గనైజర్.

★

పల్నాడులో

పల్నాడు తాలూకా పరిస్థితులను గురించి వావిలాల గోపాలకృష్ణయ్యగారు యిలా రాస్తున్నారు.

ఈనెల మధ్యలో స్థానిక వర్తకులు అధికలాభాలు గుంజవలెనని బియ్యం అధిక ధరలకు అమ్మేరు. ప్రజలలో అశాంతి బయలుదేరింది. ధాన్యం దొంగమార్కెట్టుకు చేరింది. ఇది గమనించి పల్నాడు తాలూకా తహసీల్దారు జనాబ్ గౌస్ మొహిద్దీన్ సాహెబ్ గారు ఉన్న ధాన్యం కంట్రోలు చేయడానికి ప్రయత్నించారు. అంతటితో వర్తకులు అసలు అమ్మకమే ఆపుదల చేశారు. పరిస్థితులు తెలియజేస్తూ తాలూకా కరువునివారణకమిటీవారు గుంటూరుజిల్లా కలెక్టరుకు తంతియిచ్చారు. వెంటనే నర్సారావుపేట డిప్యూటీ కలెక్టరు గురజాలవచ్చి ఒక ఆహారకమిటీని ఏర్పాటు చేశారు. ఈవిధంగానే రెంటచింతల, దాచేపల్లి, మాచర్ల, పిడుగురాళ్ల, కారెంపూడి లలో ఏర్పాటుచేశారు. గురజాలలో అప్పటికే నిల్వ ఉన్న 40 బస్తాలు ప్రజలకు విడుదలచేశారు. ఈధాన్యంలేని స్థితిని గమనించి కరువు నివారణ కమిటీ ఖర్చులు భరించి రెంటచింతల నుండి రాగులు తెప్పించి కూలీలకు 16 బస్తాల రాగులు అమ్మారు. ఈ ధాన్యం పంపకంవద్ద తొక్కులాట. కొట్లాటలు జరగడం గమనించి ఈవిధంగా లాభంలేదని యింటింటికి ఒక్కొక్క చీటీ యిచ్చి, దాని ప్రకారం పంపకం జరిపితే బాగుంటుందని సలహాయిచ్చి, కరువునివారణసంఘం ఆప్రకారంగా చీట్లు పంచింది. ఇంటిలోని పెద్దలకు 5¼ గిద్దలు, పిన్నలకు అందులో సగంవంతున రేషను యివ్వబడింది. స్థానిక గురజాలలో లేకపోతే, అధికారుల సహకారంతో పిడుగురాళ్ళనుండి తెప్పించి సప్లయి చేయబడ్డవి. వానికి ఒకేసారి అమ్మేనాలుగు డిపోలున్నూ, ప్రతి నిత్యం అమ్మే ఒకషాపు పనిచేస్తున్నవి. 4 శేర్ల బియ్యం రు 1-1-0 వంతున అమ్ముతున్నారు. పిడుగురాళ్ళనుండి తెప్పించడంవల్ల గురజాలలో మాత్రం 4 శేర్లు రు 1-1-9 లు అమ్ముతున్నారు యువకులు, కమ్యూనిస్టులు, కాంగ్రెసువాదులు, అధికారులు కలసి పనిచేసినందున గురజాలలో ఈపద్ధతి చాలబాగా అమలుజరిగింది. రెంటచింతలలో వరిగలు మొదలగు ధాన్యం కలవారు రెండవ పూటకు బియ్యంకావలెనంటే వరిగెలుతీసికొని బియ్యం యిస్తున్నారు. వరిగెలను అలవాటు పడినవారికి అమ్ముతున్నారు. అధికారుల సహకారం సరిగాలేనందున దాచేపల్లిలో ప్రజలలో అసంతృప్తి చెలరేగిపోతున్నది.

మిగతా గ్రామాలలో

అయితే ఈ నాలుగైదు గ్రామాలలో ఏదో కాస్తనయంగా సాగుతున్నదేగాని, మిగతా గ్రామాలలో ధాన్యం లభించడంలేదు. గ్రామ ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. వారికి గంజైనా లభించడంలేదు. అందుపై పల్నాడుతాలూకా కరువునివారణ కమిటీ ఈనాడు (మె 30) సమావేశమైంది. ముందుగా తహశీలుదారుతో తాలూకా పరిస్థితులు కమిటీ సభ్యులంతావెళ్ళి సంప్రదించివచ్చారు. తర్వాత తాలూకా పరిస్థితులు చక్కబడుటకు తాలూకాలో 8 కేంద్రాలుపెట్టి, ఆయా కేంద్రాల క్రింద గ్రామాలువిభజించి, ప్రతి గ్రామంలో ఒక వ్యాపారస్తుడికి లైసెన్సు ఇచ్చి కేంద్రం నుండి ధాన్యం సప్లయి చేయించాలనీ, ఈ వ్యాపారాన్నంతా సక్రమంగా జరుపుటకు ప్రతిగ్రామంలోను ఆహారకమిటీలు యేర్పరచాలనీ, ఈ కమిటీలు ఏర్పాటయ్యేలోగా వెంటనే కొంతబియ్యాన్ని గ్రామాలకు సప్లయిచేయాలనీ సూచించారు. తాలూకాలోనూటికి 10 మంది బియ్యం తినువారనేమాట, పంటలు పోయి యేధాన్యం కూడా లభించనపుడు సరియైనదికాదనీ; జొన్నలు, సజ్జలు, వరిగెలు బియ్యం అన్నిటిని ప్రజలకందచేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలెననీ; అప్పుడే నూటికింతయంటే ప్రయోజనం ఉంటుందనీ; జొన్నలు ఇతరజిల్లానుండి, నైజాం వగైరా ప్రాంతాలనుండి తెప్పించవలెననీ; వరిగలు రూపాయికి 6¾ శేర్లకు తగ్గకుండా, 7¼ మించకుండా ధర నిర్ణయించాలనీ, సూచించారు. జిల్లాఆహారసంఘంలోకి ఈకమిటీ ప్రతినిధిని తీసుకోవాలెననికోరారు. తాలూకాలో అక్కడక్కడ వరిగెలు, జొన్నలు కూడకంట్రోలు ధరలకు ప్రజలకందజేయవలసినదిగా తాలూకా రైతులను కోరవలెనని తలంచారు.

తాలూకాలో గ్రామాలలో బియ్యం లభించడం చాలా కష్టంగాఉంది. వెంటనే బియ్యంగాని మరేధాన్యంగాని ప్రజలకు అందచేయకపోతే పరిస్థితులు విషమించుతవి.

ప్రజల విజయం

ఖమ్మంమెట్టులో కమర్షియల్ కార్పొరేషన్‌ద్వారా 12 బియ్యం దుకాణాలను ప్రభుత్వం ఏర్పరచింది. ఇందులో ఒకటి అతియావర్ పేటలో ఉంది. ఒక్కొక్క దుకాణంలో 3 బస్తాల బియ్యం, 3 బస్తాల జొన్నలు అమ్ముతున్నారు. ఇవన్నీ చిల్లరగా అమ్మాలని ప్రభుత్వం ఉత్తరువు చేసింది. కాని, దుకాణంవాడు కొద్దిగా మాత్రం చిల్లరగాఅమ్మి, మిగతావి హెచ్చు ధరలకు పొరుగూరు రైతుకు అమ్మాడు. ఇది మే 10 వ తేదీన జరిగింది.

మహమ్మద్ ఇబ్రహీం అనే ఆయన ఇది చూచి పోలీసుకుచెప్పాడు. కాని అతడే మీ జోక్యం కలుగజేసికోలేదు. అప్పుడు బజారు ప్రజలు సర్కిల్‌తో చెప్పారు. సర్కిల్ ఆ ధాన్యం తీసుకుపోతున్న బండిని పోలీసు స్టేషన్‌కు పంపించాడు. ఆహారశాఖ ప్రత్యేక పరిశీలనాధికారికికూడా ఈ విషయం తెలుపబడింది 11 వ తేదీ ఉదయాన, బండిని పట్టుకొన్నవారిని రమ్మనగా వారు వెళ్లారు. కాని ఎంత సేపటికి ఆ అధికారి రానందున బండిని పట్టుకొన్నవారు వెళ్ళిపొయ్యారు.

ఆ రోజునే 2 గంటలకు బియ్యపుబస్తాలతో బండివెళ్లడంచూచి, ఆపేట ప్రజలు ఒక దరఖాస్తువ్రాసి సెకండ్ (మిగతా 10వ పేజీలో)

ఒరిస్సాలో కరువు పరిస్థితులు ★

"ఆకలిమంటల ఆక్రందనలు గంజాం, బాలసోర్ (ఒరిస్సారాష్ట్రం) జిల్లాల్లో ఆకస మంటుతున్నాయి. కటక్, పూరీ జిల్లాలు దీనికి శ్రుతికలుపుతున్నాయి. ఇప్పుడు ఏగ్రామంలో చూచినా చావులే. అన్న మోరామచంద్రా అనే ఆక్రందన ఏవేళ, ఎటు విన్నా, గుండెల్ని బ్రుంగదీస్తూంది. ఇల్లిల్లు తిరిగి తిరిపెమెత్తుకునే గతికి వచ్చారు ప్రజలు." మే 6వ తేదీన గంజాంనుంచివచ్చిన ఒకజాబు సారాంశమిది.

నిరుడు బెంగాలంతటి భయంకరమైన కరువుకు బలిఅయిన ఒరిస్సారాష్ట్రంనుంచి నేడు తిరిగి వినబడుతూన్న విశేషాలివి. రెండేళ్ళగ కరువు, వరదలు, అగ్ని, తుపాను, మలేరియా, కలరా - నానాబాధలకు గురిఅయిన కటక్, పూరి, బాలసోర్, గంజాం జిల్లాలు తిరిగి కరువురాక్షసి గుప్పిట్లోకి పోతున్నాయి.

ప్రభుత్వపు ప్లాను

ఈయేడుఒరిస్సాలో 5,57,50,000 మణుగుల ధాన్యం పండింది. నిరుడూ ఇంతే. పండిన పంటలో మూడోవంతు మార్కెట్లోకి వెళ్తుందని అంచనా. అంటే సుమారు రెండు కోట్ల మణుగులు మార్కెట్లోకి వెళ్లాయనుకోవచ్చును. అయితే యిది ఎవరిచేతిలోకి పోతూందన్నదే ప్రశ్న.

గత సంవత్సరం అనుభవాలు ఒరిస్సా ప్రభుత్వానికి కొంత పాఠం నేర్పాయి. ఏ రాష్ట్రీయ ప్రభుత్వమూ వేయనంతటి చక్కని ఆహారవిధానాన్ని కాగితంమీద వేశారు. రైతుల దగ్గర్నుంచి ధాన్యంకొనడానికిధరలు నిర్ణయించారు: ముఖ్య పట్టణాల్లో కూడా రేషనింగు అమలు జరుపుతామన్నారు: పల్లెటూరి పేదలకు, నెలకు రు 30 లకు తక్కువ ఆదాయంగల చేతి పరిశ్రమ దారులకు, పట్టణ పేదలకు బియ్యం మరీ చవుకగా అమ్మేఏర్పాట్లు చేస్తామన్నారు: బెంగాలుకి, దక్షిణ ఇండియాకు ఒరిస్సా నుంచి బియ్యం ఎగుమతి చేస్తామన్నారు. ఎవ్వరయినాసరే - ప్రభుత్వ ఏజంట్లు సహా ఒకసారి పదిమణుగులకన్న ఎక్కువ అమ్మకూడదు అనుకున్నారు. వర్తకులు, లైసెన్సుగల ఏజంట్లుకూడా, ఒకేసారి వంద మణుగులకన్న ఎక్కువస్టాకు ఉంచుకోకుండా చేయాలనుకున్నారు. ఈ విధంగా దొంగవ్యాపారాన్ని అరికట్టాలనుకున్నారు.

ఎందుకు చెడింది?

ఇంత చక్కనిప్లాను ఆచరణలో ఏమయింది? ఒరిస్సా అవసరాలకు పోను ఎగుమతులకు 6నుండి 9 లక్షలమణుగుల దాకా మిగులుతాయి. అలాంటిది22లక్షలమణుగులు ఎగుమతిచేయడానికి ఒరిస్సా ప్రభుత్వం ఒప్పుకొంది.

కాని, అసలుసమస్య ఏమిటంటే - ప్రభుత్వం ఎంత కొంటుంది? ఎవరిద్వారా కొంటుంది? ఈ విషయాల్లోనే ఒరిస్సాప్రభుత్వం తప్పటడుగు వేసింది. వెంట్రుకవాసిలోకి మరోకరువును తెచ్చిపెట్టింది. రాష్ట్రఅవసరాలకు సరిపోయినదానిలో, ఐయిదవవంతు మాత్రమే మార్చినెలాఖరుకు కొనగలిగామని ఆహారశాఖ మంత్రి అసెంబ్లీసభలో చెప్పాడు. మార్చినెలసరికి సగమయినా కొనియుండవలసినది. ప్రభుత్వపు కొనగోలు ప్లాను విఫలమయిందనడానికి ఇదే నిదర్శనం.

ఎందువల్ల ఇలా జరిగింది? ప్రజాఆహార కమిటీ అజమాయిషీక్రింద తమ పనిని చిత్తశుద్ధితో సాధించగలవారిని ధాన్యపు కొనుగోలుకు వినియోగించినప్పుడే ప్రభుత్వ ప్లాను జయప్రదం కాగలదు. అది జరగనిచో. అయిదుమాసాలయిన తరువాతకూడ కావలసినదానిలో అయిదోవంతు కన్నా ఎక్కువ కొనలేకపోవడం ఆశ్చర్యం కాదు.

ప్రభుత్వ ఏజంట్లు కొనుగోలు ప్లానును ఎలా చెడగొట్ట గలిగారు? రైతులవద్దకు పోయి ధాన్యాన్ని అందుకు తోలే ఖర్చులు కూడ రైతులేపెట్టుకోవాలన్నారు. ఈఏజంట్లు లైసెన్సులేనివ్యాపారస్థులు. ఇది అవకాశంగా తీసుకొని, పొలాల్లోవున్న ధాన్యాన్నే కొనేయడం ప్రారంభించారు. అంతేకాదు. కంట్రోలు రేటు మణుగు రు 4-6-0 అయితే ఈఏజంట్లు కొన్ని ప్రాంతాల్లో రు 2-6-0 లకే కొనబోయారు. ఇక రైతు వీళ్ళకు అమ్మడానికెందుకు ఇష్టపడతాడు? అక్కడితో ఆగలేదు ఈ ఏజంట్ల పోకడలు. ఒరిస్సాలో ధాన్యం ఎక్కువభాగం ధనికులదగ్గరుంటుంది. కొనుగోలు ఏజంట్లు ఎక్కడా వారి సమీపంలోకి పోక, మధ్యరకంవారిని పీడించసాగారు. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో ఈ రైతులు ధాన్యం దాచేశారు. తిండిదొంగలు ఈ పరిస్థితులు పూర్తిగ వినియోగించుకొన్నారు. తమ దొంగ నిలవలను గ్రామస్తులు దాచేలా కూడా చేశారు. "ప్రభుత్వం సప్లయి డిపోలు పెడతానంది. ఇంకెప్పుడు ప్రారంభిస్తారు? బూటకం. ప్రభుత్వం మీ ధాన్యం తీసుకుపోతూంది. తిరిగి మీకు గింజయినాదొరకదు. మాకమ్మండి- జాగ్రత్తగాఉంచుతాము- మీకు మంచి ధరలిస్తాము" - ఇదీవీరువేసిన ఎత్తు. అమాయిక రైతులు యీ ఎరకు లోపడ్డారు. ప్రభుత్వం డిపోలు త్వరగా ప్రారంభించకపోవడం ఇందుకుతోడ్పడింది.

పరిస్థితులన్నిటినీ పరిశీలిస్తేతేలిందేమిటి? ప్రభుత్వ స్టాకులకోసం కొనాలనే ఉద్దేశం కొనుగోలు ఏజంట్లకు ఏమాత్రంలేదని, అంతేకాకుండా, రహస్యంగా కొని దొంగమార్కెట్టుకు పంపుతున్నారని కూడా జిల్లాలనుంచి వార్తలు వచ్చాయి.

అకలి - అంటువ్యాధులు

ఇలాంటి పరిస్థితుల ఫలితంగా అనేక జిల్లాల్లో అకలిమంటలు అలుముకోసాగాయి. పూరీ జిల్లాలోని బ్రహ్మగిరానాలో ఎన్నో రోజులు అంగడిలో ఒక్కగింజయినా దొరకలేదు. ఆ జిల్లాలోనే సత్పాద ప్రాంతంలో 20 గ్రామాల ప్రజలు ఒక్కరూపాయి గింజలు కొనుక్కోలేక అల్లాడిపోయారు డాక్‌బంగళాలో 300 మణుగులు నిలయి ఉన్నప్పటిక్కూడా. ఇంకా ఎన్నో ప్రాంతాలనుంచి ఇలాంటివార్తలు వచ్చాయి.

దీనితోపాటు ధరలు పెచ్చుపెరగసాగాయి. గంజాంజిల్లాలో రస్సెల్‌కొండలో మార్చి 19వ తేదీన బియ్యం ధర రూపాయికి 4 శేర్లనుంచి 3 శేర్లకు పెరిగింది. సంకిమెడిలో ధాన్యంధర రూపాయికి 9¼ శేర్ల నుంచి 6¾ శేర్లకు పెరిగింది జాలేశ్వర్, బలాసోర్ జిల్లాలనుంచి అకలివల్ల చనిపోయినవారి లెక్కలు రాసాగాయి.

సరియయిన ఆహారం లేకపోవడంవల్ల వ్యాపించేజాడ్యాలు చెలరేగడం ప్రారంభించాయి. ఒకవైపు కరువురాక్షసి, మరోవైపు జాడ్యాల మహామారి - ఈ రెండిటి బారికి తట్టుకోలేక గ్రామస్థులు గ్రామాలను విడిచి, పొట్టకోసం పయనం ప్రారంభించారు. ఫతియబాద్ జనాభాలో మూడోవంతే మిగిలింది. గత సంవత్సరపు కరువు అంతటిలోను అక్కడ 1442 మంది చనిపోయారు. 2562 మంది ఊరు విడిచిపోయారు. ఈ ఏడు రెండు మాసాల్లోనే 1000 మంది గ్రామం వదిలిపోయారు. తాల్చేర్‌లో ఆకలిమంటలకు రెచ్చిపోయి గ్రామస్తులు ఒక తిండిదొంగను చంపేశారు.

ఈ పరిస్థితుల్ని చూచి ప్రభుత్వం బేజారెత్తిపోయింది. కొనుగోలు ఏజంట్లపనిని తనిఖీ చేయడానికి ఇన్‌స్పెక్టర్లను నియమించింది. దీనివల్ల పరిస్థితులు బాగుపడతాయనుకొంది. లాభాలు రుచిమరిగిన ఏజంట్లు దీనికి ఎదురెత్తువేశారు. ఒకడితరవాత ఒకడు రాజీనామా లివ్వసాగారు. మరో కరువు ప్రళయంలా విరుచుకు పడకుండా చేయడానికి కొనుగోలు ముమ్మరంగా సాగించవలసిన రోజుల్లో వీరి రాజీనామా! ఇన్‌స్పెక్టర్లు కూడా అంతకు తీసిపోనివారే. ప్రభుత్వప్లానును భగ్నంచేయడానికి వీరు కూడా కుట్రలు పన్నసాగారు. కాకత్పూరులో ఒక పెద్ద దొంగ వ్యాపారి, తనస్టాకును దాచేయడానికి అక్కడి ఇన్‌స్పెక్టరు సాయంపొందాడని వార్త.

ప్లాను మార్చింది

పరిస్థితులిలా ఉండగా ప్రభుత్వం చౌకడిపోల ప్లాను మార్చింది. మొదటి ప్లానులో వ్యవసాయానికి లాయకిఅయిన భూమి 4 యకరాలున్న ప్రతివానికి చవుకడిపోలద్వారా బియ్యం సప్లయిచేయాలనుకున్నారు కొత్త ప్లానులో ఇది మార్చేశారు. ఒక యకరం కన్నా తక్కువ ఉన్నవారికే రూపాయికి 4¼ శేర్ల బియ్యం, లేక 8 శేర్ల ధాన్యం సప్లయి చేస్తామంటున్నారు. పట్టణాల్లో రు 1 కి నెలకు రు. 10 ల రాబడి వచ్చే వారికి లేదా మొత్తం కుటుంబానికి రు. 25 ల కంటే తక్కువరాబడి వచ్చేవారికి మాత్రమే సాయం చేస్తారట. అంతేకాదు. కరువు ప్రాంతాల్లోను. తరుగు ప్రాంతాల్లోనుఉన్న వ్యవసాయ కూలీలకే ఈ కొత్తప్లాను వర్తిస్తుందట - ఇతర ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు వర్తించదట.

మొదటప్లానువల్ల 6 లక్ష రూ। నష్టం వస్తుందట - దానిని ప్రభుత్వం భరించలేదట. అందుకే ఈకొత్తప్లానని ప్రభుత్వపు సంజాయిషీ. నిజానికి మొదటప్లానే చాలీచాలని మేలు చేయగలదు. 15 లక్షలప్రజకుసాయం చేయవలసిన అవసరం (ఖర్చు 50 లక్షల రూపాయలు) ఉంటే ఆప్లాను 2 లక్షలప్రజకు మాత్రమే ఉపయోగ పడగలదు. కొత్తప్లాను సంగతివేరేచెప్పనవసరంలేదు. పూర్తిసాయం చేయడానికికావలసిన డబ్బు సంపాదించవచ్చు ఎగుమతి అవుతున్న 22 లక్షల మణుగులమీద మణుగుకు రు 2-0-0 లాభం చొప్పున రు 44 లక్షలు సంపాదించవచ్చు. మిగతాది అప్పులద్వారా, విరాళాలద్వారా పోగుచేయవచ్చు.

ప్రజాసేవకుల కృషి

ఈలోగా పరిస్థితులు విషమించి పోతున్నాయి. గంజాంనుంచి ఒక కామ్రేడ్ ఇలా రాశాడు: "బియ్యం, రాగి, మొదలయినవి అంగట్లో ఉన్నాయి. కాని వాటి ధర ప్రజాసామాన్యానికి అందుబాటులో లేవు. భూమిలేని పనివారు పొట్టకు చాలినంత కొనలేకపోతున్నారు." కటక్ జిల్లాలో అకలివల్ల చనిపోతున్నారు (ఏప్రిల్‌లో). గంజాంలో కూడా ఇలాంటి చావులుగురించి ఒరిస్సా రిలీఫ్‌కమిటీకి జాబులు వచ్చాయి.

ఒరిస్సా రిలీఫ్‌కమిటీ 12 వైద్యసహాయక కేంద్రాలను నడుపుతూంది. రు 10 వేల పెట్టుబడితో 15 చర్ఖా కేంద్రాలను ప్రారంభించాలని తీర్మానించింది 'సంచారక వైద్యశాల' ఒకటి ప్రారంభించడానికికూడా నిర్ణయించుకున్నారు.

ప్రజా ఆహారకమిటీలు రైతుల్లో ప్రచారం సాగిస్తున్నారు. ఏజంట్లకుగాని, ప్రైవేటు కోఆపరేటివ్ స్టోర్సుకుగాని ధాన్యం అమ్మవలసిందని నచ్చజెబుతున్నాయి. ఈ స్టోర్సు పట్ల ప్రభుత్వవ్యతిరేకతను తొలగించారు. వీటి కృషి కొంత ఫలితం సాధించింది. 'ఆహార సలహాసంఘాల'ను ప్రభుత్వం ఇంకా విరివిగా వ్యాపింపజేసింది. ఈ కమిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెసు, కిసాన్ సభ. కమ్యూనిస్టు దేశసేవకులు వీటిలోకి ఎన్నుకోబడుతున్నారు. దేశభక్తులందరూ ఏకముఖంగా కృషి సాగిస్తే ఒరిస్సాను రెండవ కరువుబారినుండి కాపాడవచ్చు. ప్రభుత్వం వెంటనే ఈ దిగువపనులుచేయాలని ఒరిస్సా రిలీఫ్‌కమిటీ విజ్ఞప్తి చేసింది: క్షామపరిస్థితులేర్పడిన ప్రదేశాల్లో జమీందారీశిస్తు వసూళ్ళు ఆపాలి: ఎద్దులు, గింజలు, సొమ్ము వ్యవసాయదారులకు సప్లయి చేయాలి: ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా చవుకధాన్యం డిపోలు ప్రారంభించాలి: యుద్ధఖైదీలను గుర్తించి నిర్బంధం వెంటనే మానిపించాలి: అధికాహారోత్పత్తి ఉద్యోగులు దేశమంతా తిరిగి నీటి వరపరాలను, వ్యవసాయపద్ధతుల్ని అభివృద్ధి పరచడానికి పాటుపడాలి.

ఒరిస్సా ప్రజల విజ్ఞప్తి

★

ఒరిస్సా రిలీఫ్‌కమిటీనిధి అయిపోయింది. మా విజ్ఞప్తిని సహాయంచేసిన వారందరికి మాకృతజ్ఞత. మరొక లక్షరూపాయల విరాళంకోసం విజ్ఞప్తి చేస్తున్నాము. ముంచుకొస్తున్న కరువుప్రమాదంనుంచి ఒరిస్సాను కాపాడాలంటే వెంటనే ఈసహాయం చేయండి.

యల్. యస్. సాహు

సోదరదేశభక్తులారా: ఒరిస్సా ప్రజలు మీసహాయాన్నర్థిస్తున్నారు. పంపగల సహాయం అంతా ఈ దిగువఅడ్రసుకు పంపండి.

యల్. యస్. సాహు,
కార్యదర్శి: ఒరిస్సారిలీఫ్‌కమిటీ,
చాందినిచౌక్: పోస్టు కటక్.

"తమ స్వాతంత్ర్యాన్నే కాకుండా ప్రపంచాన్నే కాపాడుతున్నారు"

●

సోవియట్ ప్రజలకు, రెడార్మీకి సోవియట్ మిత్రమండలి జోహారులు

ఇది ఒక గొప్ప విజ్ఞానకేంద్రం, బొంబాయి విశ్వవిద్యాలయంనుంచి పట్టభద్రులైన యువతీ యువకుల కందరికి ప్రతిసంవత్సరం అహాలులో యోగ్యతాపత్రాలు ఇవ్వబడుతూ ఉంటాయి.

ఆ హాలులో జూన్ 3, 4 తేదీలలో ప్రముఖ కాంగ్రెసు నాయకురాలైన శ్రీమతి విజయలక్ష్మి పండిట్ అధ్యక్షతక్రింద అ. భా. సోవియట్ మిత్రమండలి సమావేశం జరుగుతోంది.

సోవియట్ భూమికి, భారతదేశానికి మధ్య విజ్ఞాన స్నేహ సంబంధాన్ని పెంపొందించాలనిఆశించే సోవియట్ మిత్రమండలి తరఫున 108 మంది ప్రతినిధులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. వీరిలో ప్రముఖలాయర్లు, డాక్టర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు అందరూ ఉన్నారు. అందరూ ఒకే రాజకీయ అభిప్రాయాలు కల్గినవారుకాదు. కాంగ్రెసు, లీగ్, కమ్యూనిస్టు పక్షాలకు చెందినవారు, అభివృద్ధిని కోరే సుప్రసిద్ధ సైంటిస్టులు, కవులు, గాయకులు, చిత్రకళోపాసకులు, అందరూ ఉన్నారు. ఇటువంటి సర్వతోముఖ సమావేశం దేశాభ్యుదయానికి తోడ్పడగలదని ఆహ్వాన సంఘాధ్యక్షులు బ్రెల్వీగారుఅన్నారు.

అధ్యక్షపీఠానికి వెనుక ఎత్తుగా పెద్ద బానర్‌మీద "రెడ్‌ఆర్మీకి వందనాలు" అని వ్రాయబడిన ఎర్రఅక్షరాలు సమావేశ ఉద్దేశాన్ని తెలుపుతున్నాయి. రెడ్‌ఆర్మీగెరిల్లాలు, సోవియట్ ప్రజలు తమ ప్రాణాల నొడ్డుతూ సాగిస్తున్న పోరాటాన్ని తెలియజేయు గంభీర చిత్రాలు హాలులో రెండువైపులా గోడలమీద అలంకరించబడి ఉన్నాయి. 2000 మంది ప్రేక్షకులతో హాలంతా నిండిపోయింది. ఇటువంటి ఐక్యదేశభక్తుల సమావేశం ఈమధ్య బొంబాయిలో ఎప్పుడూ జరగలేదన్నాడు ఒక ముసలి దేశభక్తుడు.

బ్రెల్వీ ఉపన్యాసం

3 వ తేదీ సాయంత్రం 6 గంటలకు హరీంద్రనాథ చటోపాధ్యాయ తన సుప్రసిద్ధ గీతాన్ని "అగేచలో, అగేచలో" ప్రారంభించాడు. హాలంతా నిశ్శబ్దం. పాట హాలులో అన్నివైపులప్రేక్షకుల వందరినీ ఉత్తేజపరిచింది.

వెంటనే బ్రెల్వీ, (బొంబాయి క్రానికల్ పత్రికా సంపాదకులు) 1100 మంది ఆహ్వాన సంఘసభ్యుల తరఫున ప్రతినిధులకు యిలా ఆహ్వానం ఇచ్చాడు: "రష్యన్‌విప్లవం ప్రపంచంలో బ్రహ్మాండమైన విజ్ఞానవిప్లవాన్ని లేవదీసింది. ఈవిజ్ఞాన ఆదర్శాలను హరించడానికి వచ్చినఫాసిస్టులతోపోరి రెడ్‌ఆర్మీ మానవనాగరికతను రక్షిస్తోంది. రెడ్‌ఆర్మీకి జోహారులర్పించడం దేశభక్తులవిధి. అది కాంగ్రెసు సాంప్రదాయం గూడా" అనిచెపుతూ, రష్యన్ విప్లవంవల్ల సోవియట్ ప్రజలకు కలిగిన లాభాలను వివరీకరిస్తూ, వారు నిర్మిస్తున్న నూతన సమాజాన్ని పరిశీలించి, ఆప్రజలతో స్నేహమును పెంపొందించుకొనుట అవసరం అన్నారు. సోవియట్ మిత్రమండలి ఒక ప్రత్యేక పక్షానికి చెందినది కాదని, దేశభక్తులందరియొక్క సంస్థయని, ఆవిధంగా దాన్ని అభివృద్ధిచేయాలని ఉద్బోధించారు.

సందేశాలు

"సోవియట్ ప్రజల నూతన సాహిత్యం, కళలు, జీవితవిధానాలను గురించి తెలుసుకుని, సోవియట్ ప్రజలతో దగ్గర సంబంధాలను కల్పించుకొనుటయే సోవియట్ మిత్రమండలి యొక్క ఆశయం. ఇంగ్లండుకు-సోవియట్‌కు మధ్య 1941 లో జరిగిన ఒడంబడిక అనేక గొప్పఫలితాలకు దారితీసింది. ముందు ఈ ఒడంబడికయే మానవజాతి విముక్తికి గూడా దారితీస్తుందని నమ్ముతున్నాను." అని ప్రముఖ కాంగ్రెసు నాయకులైన భులాభాయి దేశాయిగారు సందేశాన్ని పంపారు. సోవియట్ ప్రజల జీవిత కార్యకలాపాలను అభినందిస్తూ, సోవియట్ మిత్రమండలి సమావేశాన్ని జయప్రదం గావించాలని ప్రముఖముస్లింలీగునాయకుడైనలియాఖత్ అలీఖాన్ సందేశాన్ని పంపారు. తరువాత సరోజినీదేవి రాధాకృష్ణన్, సహజానంద సరస్వతి, కీ. శే. టాగూరుకు సెక్రటరీగా పనిచేసిన అమియచక్రవర్తి, ప్రొఫెసర్ బోధాక్‌కోసంబీ, డాక్టర్‌సుబ్బరాయన్, ఘోష్ (బెంగుళూరు సైన్సు ఇన్‌స్టిట్యూట్‌డైరక్టర్) ప్రముఖ సినిమా డైరక్టర్ శాంతారామ్, కేరళ రాష్ట్ర 'టాగూర్' వల్లతోల్, బీహార్‌రాష్ట్ర ముస్లింలీగు కార్యదర్శి సుల్తాన్‌మహమ్మద్, సుప్రసిద్ధ మరాటీకవి మామావారేర్కర్, బి. గోపాలరెడ్డి, జాఫర్ ఇమామ్ (బెంగాల్ ముస్లింలీగ్ నాయకుడు) మొదలైనవారినుంచి వచ్చినసందేశాలను చదివివినిపించారు. వివిధ జీవిత కార్యకలపాల్లో ప్రసిద్ధికెక్కిన శాస్త్రవేత్తలు, రాజకీయనాయకులు, కవులు — ఈవిధంగా అందరూ సోవియట్ విజ్ఞానాన్ని అభినందిస్తు ఇచ్చిన సందేశాలు సమావేశ ప్రాముఖ్యతను ఎక్కువచేసినయి. ఇంగ్లండు బొగ్గుగని కార్మికసంఘ అధ్యక్షుడైన విల్ లాదర్, చెకోస్లోవేకియా, చైనా రాయబారులు పంపిన సందేశాలు కూడా చదవ బడినాయి.

మా విలేఖరి

శ్రీ విజయలక్ష్మి పండిట్

సందేశాలు చదివిన తరువాత, అధ్యక్షోపన్యాసం జరిగింది. "ప్రపంచ ప్రజలనందరిని ఉత్తేజపరుస్తున్న రెడ్‌ఆర్మీకి, సోవియట్ ప్రజలకు అభివందనాలను తెలుపుటలో నేను కూడా కలిసిరావమనికిసంతోషిస్తున్నాను" అని శ్రీమతి విజయలక్ష్మిపండిట్ తమ ఉపన్యాసాన్ని ప్రారంభించారు.

"మనం మన పొరుగునవున్న రష్యానుంచి ఎన్నో పాఠాలు నేర్చుకొనవచ్చు. నాటిని మనసమస్యల క్రమగుణ్యంగా వర్తింపజేసుకోవచ్చు. స్వాతంత్ర్య సాధనకై మనం గావించే కృషికి అపాఠాలు తోడ్పడతాయి. మానవజాతి అభివృద్ధి చెందడాని కవసరమైన కొన్ని ఆశయాలకొరకు రష్యానిలబడివుంది. వాటికై నేడు పోరాడుతోంది: కేవలం తమ యిక్యవాక్యతను రక్షించుకోవడమే రష్యన్ల ఆశయంకాదు. శాంతి, రష్యా నేడనుభవించు తూన్న బాధలవల్ల మన హృదయాలు తపించిపోతున్నాయి. ఈ పరీక్షాసమయంలో రష్యాకు మనం పంపే సౌహార్ద్ర సందేశం యిదే."

సౌహార్ద్ర ప్రతినిధులు

ఇంగ్ల సోవియట్ మిత్రమండలి తరఫున, వచ్చిన స్టాలిన్ ఇమాండిన్‌గారు, సోవియట్‌లో 10 సంవత్సరాలు ఉండివచ్చిన శ్రీనివాస్‌సింగ్, భారత కమ్యూనిస్టుపార్టీ తరఫున రణదివే, ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ తరఫున యన్. యమ్. జోషీ, ఫ్రెంచి ఇండియా ప్రజలప్రతినిధి, బొంబాయి సెంటినల్ పత్రిక సంపాదకులు హార్నిమన్, అభ్యుదయ రచయితల సంఘం తరఫున అబ్బాస్, హరీంద్రనాథ్‌చటోపాధ్యాయ (ప్రజా నాట్య మండలి) గుర్బన్‌సింగ్, మిస్ నానావతీ (మహిళల తరఫున) మొదలైన సౌహార్ద్ర ప్రతినిధులు సోవియట్ ప్రజలను అభినందిస్తూ ఉపన్యసించారు.

తీర్మానాలు

నాలుగవతేదీ ఉదయం తీర్మానాలు జరిగాయి.

సోవియట్ ప్రజలకు, వీరరెడార్మీకి అభివందనలర్పిస్తూ ఒక తీర్మానం జరిగింది. వీరుతమ స్వాతంత్ర్యాన్నే కాకుండా, యావత్ ప్రపంచాన్ని ఒక ఘోర ప్రమాదం నుంచి కాపాడుతున్నారని ఈ తీర్మానం తెలిపింది. నాజీ రాక్షసకృత్యాలను ఖండిస్తూ ఒక తీర్మానం, సోవియట్ మిత్రమండలి పాత్రను నిర్వచిస్తూ మరో తీర్మానం జరిగాయి. మనదేశానికి సారస్వతం, చిత్రపటాలు, ఫిల్ములు మొదలయినవి విరివిగా సప్లయిచేయాలని సోవియట్‌ని కోరుతూ ఒకతీర్మానం జరిగింది. సోవియట్ ఫిల్ములను మనదేశంలో సినిమా యజమానులు ప్రదర్శిస్తుండాలని కోరింది. మహాత్ముని విడుదలకు ఆనందాన్ని తెలుపుతూ, వారి విడుదల ఫలితంగా త్వరలో భారతరాజకీయసమస్యా పరిష్కారం కాగలదనిఆశిస్తూ ఒక తీర్మానం జరిగింది.

సోవియట్ మిత్రమండలి ప్రధానకార్యాలయాన్ని బొంబాయిలో ఏర్పరచి, వీలుచిక్కినవెంటనేఒక పత్రికను ప్రచురించాలనిమరో తీర్మానం జరిగింది.

వర్కింగుకమిటీ

వచ్చే సంవత్సరానికి అఖిల భారత సోవియట్ మిత్రమండలికి అధ్యక్షులుగా శ్రీమతి సరోజినీనాయుడుగా రుండుటకు అంగీకరించారనిప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ చెప్పగానే సంతోషధ్వనులు మిన్నుముట్టినాయి. కొత్త వర్కింగ్‌కమిటీకి

అధ్యక్షులు : సరోజిని నాయుడు.
ఉపాధ్యక్షులు : యస్.ఏ.బ్రెల్వీ (బొంబాయి)
వల్లతోలుకవి (మలబార్)
డాక్టర్ భూపేంద్రదత్త, (బెంగాల్)
కె. శ్రీనివాసన్ (మద్రాసు హిందూ పత్రిక సంపాదకులు)
కార్యదర్శి : ఆర్. యమ్. జాంభేకర్,
సంయుక్త కార్యదర్శులు: ప్రొఫెసర్ జునార్కర్, ప్రొఫెసర్ హిరేన్‌ముఖర్జీ.
కోశాధికారి : మహేంద్రప్రసా.

వీరుగాక రాష్ట్రాలవారీగా ప్రతిరాష్ట్రానికి ఒక కార్యనిర్వాహక సభ్యుడు ఎన్నుకొబడ్డాడు.

ముషైరా

4 వ తేదీ సాయంత్రం 6 గంటలకు వివిధ భాషలలో పేరుగాంచిన సుప్రసిద్ధ కవులందరు చేరి సోవియట్‌ను అభినందిస్తూ తాము వ్రాసిన నూతన గీతాలను స్వయంగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమం 3 గంటలు పట్టింది. ప్రేక్షకులు రెట్టింపుగా వచ్చారు. ఇన్నివేలమంది విజ్ఞానవంతులు కలిసి సోవియట్‌ను అభినందిస్తూ, జరుపుట కిదే మొదటిసారి సమావేశం.

రవీంద్రనాథ్ టాగూర్ సోవియట్ అభ్యుదయాన్ని హర్షిస్తూ వ్రాసిన రెండు గీతాలను ప్రొఫెసర్ నిరేంద్రనాథ్‌రాయ్, రాధారమన్ మిత్రగార్లు చదివారు. "ఎర్రసైన్యం రణరంగానికి దుముకుతోంది" అని హరీంద్రనాథ్ తన గీతికను గంభీరంగా చదివాడు. హైదరాబాద్‌నుంచి మగ్దుమ్ "కార్మికులు పెట్టుబడి" అను గీతాన్ని చదివాడు. యు.పి. రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా సమావేశానికి వచ్చిన సుప్రసిద్ధఉర్దూమహాకవి జోష్‌మాలీహాబాదీ "విప్లవం ముందుకుసాగిపోతూంది." అనుగీతాన్ని చదివి సభికులందరిని ఉద్రేకపరిచాడు. గుజరాత్ కవి భోగీలాల్‌గాంధి, మహారాష్ట్రనుంచి వసంతభాగవత్, మలబార్ కవి వల్లతోల్, అహమ్మదాబాద్‌నుంచి కార్మిక కవి అబ్దుల్ రహిమాన్, విప్లవకవి నిజామి, మజ్నీ, నరేంద్రశర్మ, ప్రముఖ యువకకవి ఓజ్జన్, మొదలైనవారు స్వయంగావచ్చి ముషైరాలో (కవి సమ్మేళనంలో) పాల్గొన్నారు.

సినిమాయాక్టరు పృధ్వీరాజ్ చివరికి సోవియట్‌ను అభినందిస్తూ ఉపన్యసించి సభికుల కోర్కెపై "సారాజహాంసే అచ్ఛా హిందూస్థాన్ హమారా" అని ప్రముఖ ముస్లిం కవి ఇక్బల్ వ్రాసిన దేశభక్తిగీతం పాడాడు.

"సోవియట్ మిత్రమండలి ప్రధానంగా దేశభక్తులందరియొక్క సంస్థ. దేశభక్తులైన రాజకీయవాదులు, అభివృద్ధికోరే ఇతరులు అందరూ ఐక్యమై సోవియట్ మిత్రమండలిని ఏర్పరచుట సంతోషదాయకమై ఉన్నది. విశేధాలతోఉన్న ప్రస్తుత వాతావరణంలో ఈసమావేశం దేశభక్తులనందరిని ఉత్సాహపరచి ఒకేసంస్థలోకి తీసుకొని వచ్చుటకు ఉపయోగపడగలదు. సోవియట్ మిత్రమండలి ఉద్యమానికి నేను విజయం కోరుచున్నాను" అని ఉపన్యసిస్తూ, సమావేశ కర్తలను, వాలంటీర్లను అభినందిస్తూ బ్రెల్వీగారు సమావేశాన్ని ముగించారు.

విజ్ఞాన ధనులారా!

★

మనసోవియట్ మిత్ర - మండలిని బలపర్చ
విజ్ఞానధనులార - వేగమె కారండి –
మనిషి మనిషినిదోచి - మాడ్చిచంపుక తినక
సర్వహక్కులు ప్రజకు - సంక్రమింపగజేసి
విశ్వమానవప్రేమ - వెదజల్లు ఆదర్శ
సోవియట్ రాజ్యంపు - సోదరత్వముగోరు
॥మన॥
స్త్రీకి స్వాతంత్ర్యంబు - స్వేచ్ఛ గలుగజేసి
పురుషులెంతో యంతే - పొలతులని చాటింది
గణుతి గాంచినయట్టి - ఘన సోవియట్‌రాజ్య
ప్రజల శక్తికియున్న - ప్రతిభ గుర్తించే
॥మన॥
నిరక్షరాస్యతను - నిర్మూల మొనరించి
జాతి మతభేదాల - గోతిలో పాతేసి
విజ్ఞానచంద్రికలు - విరజిమ్ముచున్నట్టి
సోవియట్‌అనసెంతో -సుముఖత్వమునుజూపు
॥మన॥
రవీంద్రవిశ్వమానవప్రేమ వెల్లివిరియగా
ఫాసిస్టుదుండగీండ్ల గుండెలన్ని పగులగా
పొడసూపు యెర్రనిశక్తింపు వెలుగదేనురా
బలపర్చ దీని సాగిముందు కొక్కయడుగులో
ప్రజాస్వాతంత్ర్యంబు గోరువారు రండిరా
॥మన॥

— సుంకర సత్యనారాయణ

గనులలో ఆడకూలీల ఇబ్బందులు!

గూడూరుతాలూకాలో చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాల సమీపంలో సుమారు 15 మైకాగనులున్నాయి. అక్కడి కూలీల్లో మూరింట 60 మంది స్త్రీలు. గనులలోని స్త్రీ కూలీలకు ప్రసూతి సౌకర్యాలను గురించి ప్రత్యేకచట్టం (1941 లో చేయబడింది) ఉందన్న సంగతే వీరికి తెలియదు. దీనిప్రకారం, ప్రసవంనాటికి ఒకేగనిలో 6 మాసాలు పనిలోఉన్న ప్రతి గర్భిణీస్త్రీకి ప్రసవించుటకు ముందు 4 వారాలు, తరువాత 4 వారాలు సెలవు ఇవ్వాలి. సెలవురోజుల్లో రోజుకి 0-8-0 చొప్పున ఖర్చుకు ఇవ్వాలి. గనుల యజమానులు ఈచట్టాన్ని అమలుపరచడమే లేదు. అంతేగాకుండా నిండు గర్భవతులను పనిలోనుంచి వెళ్లగొట్టి, నిరాధారులను చేస్తున్నారు. పైచట్టాన్ని అమలు పరచకుండా ఈవిధంగా తప్పించుకో జూస్తున్నారు ఈ గనుల యజమానులు. 'కుబేరా' గని విస్సా రాజగోపాలరావుగారిది. దాసరి మంగమ్మ అనే ఆమె కొన్ని సంవత్సరాలనుండి ఇందులో పనిచేస్తుండేది. ఈమె నవమాసములు గర్భవతిగా ఉంటుంటే, హటాత్తుగా పనిలోనుంచి తొలగించాడు మేనేజరు. తిప్పవరప్పాడు సమీపంలో వాపుసాహెబ్ రాచపూటి రామలింగశెట్టిగారి 'ప్రసన్నకుబేరా' గని ఉంది. ఈగని మేనేజరు గతమాసం చివర రోజుల్లో 5 గురు గర్భవతులను నిలిపివేశాడు. వీరు 6 మాసాలు మొదలుకొని 1½ సంవత్సరాల సర్వీసుగలవారు. ఇతరగనుల యజమానులు కూడా ఈ మార్గాన్నే అనుసరించే సూచనలు కనబడుతున్నాయి.

'గూడూరు డివిజన్ మైకా కార్మికుల సంఘం' ఈ అమానుష పరిస్థితులను అరికట్టడానికి పూనుకొంది చట్టరీత్యా తమకుగల ప్రత్యేకహక్కులను స్త్రీకార్మికుల్లో ప్రచారం చేసింది. ఈనెల మొదటితేదీని సంఘ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, తీసివేయబడిన స్త్రీ కూలీలనుగూడా సబ్‌కలక్టరువద్దకు రాయబారంతీసుకు వెళ్ళారు. ఆయన అంతావిని, తాను చేయగలిగినదంతా చేస్తానని హామీ యిచ్చాడు.

స్త్రీ కూలీలందరూ సంఘంలోచేరి, దాని శక్తి ద్వారా తమ న్యాయమైనహక్కుల్ని సాధించాలి. యజమానుల దారుణప్రవర్తనను ప్రభుత్వం వెంటనే అరికట్టి, కార్మికుల్లో అసంతృప్తి రాకుండాచేసి, ఉత్పత్తిని కాపాడాలి.

★

పనివారి బ్రతుకంటే లక్ష్యంలేదు

ఈ గని యజమానుల అక్రమాలు ఇంకా ఉన్నాయి. వీరిప్రవర్తనచూస్తే కార్మికుల బ్రతుకంటే వీరికేమాత్రం లక్ష్యంలేనట్లుంది. పోగివల్లిక్షేత్రియంలోని 'విశ్వేశ్వరాగని' మేనేజరు మహమ్మద్ అబ్దుల్ రజాక్ సాహెబ్. జనవరి 15 వ తేదిని (సెలవురోజు) ఈయన ఇంజను క్లీనరు బికారిసాహెబ్‌ను పిలిచి, రెండుతోటాలిచ్చి దగ్గరనున్న చెరువులో చేపలుపట్టి తెమ్మన్నాడు. (తోటాను కాల్చి నీళ్ళలోవేస్తే, ఆ అదురుకు చేపలు చస్తాయి. వాటిని దేవుకొనివస్తారు.) తోటాను కాల్చడం తనచేతగాదని బికారిసాహెబ్ చెప్పినా వినక, నిర్బంధం చేశాడు మేనేజరు. బికారి వెళ్ళాడు; తోటాను కాల్చాడు. అది చేతిలోనే పేలింది. కుడిచేయి మణికట్టు వరకు తీసివేయవలసి వచ్చింది. రెండునెలలు చికిత్స పొంది, తిరిగి పనిలో చేరుదామనివచ్చాడు. కుడిచేయి లేనివాడు ఇక యజమానుల కెందుకు? లేనిపోని నేరాలుమోపి అతన్ని పనిలోనుంచి తీసివేశారు. అతను బిచ్చమెత్తుకునే స్థితికి వచ్చాడు. యూనియన్ అతని విషయంలో జోక్యం కలిగించుకొంది. అతని వాఙ్మూలం తీసుకొని అధికారులకు తెలిపింది. ఈ ఒత్తిడి ఫలితంగా ఈనెల 3 వ తేదీని మైకా ఇన్‌స్పెక్టరు, అసిస్టెంటు ఇన్‌స్పెక్టరు వచ్చి విచారించి వెళ్లారని తెలిసింది.

★

చేనేత పారిశ్రామికులు : నూలు సప్లయి సమస్య

ఐందరు తాలూకాలో 10,000 మంది చేనేత పారిశ్రామికులున్నారు. నూలు సప్లయి సరిగా లేకపోతే వీరి వృత్తి మూలబడుతుంది. ప్రభుత్వం నూలుధరను కంట్రోలు చేసిందేగాని, సప్లయి విషయంలో తగిన ఏర్పాట్లుచేయలేదు. అందువల్ల ధరల కంట్రోలు సరిగా అమలు జరగడంలేదు. వర్తకులు అధిక ధరలకు అమ్ముతున్నారు. కంట్రోలు రేటుకి అడిగితే నూలు లేదు పొమ్మంటున్నారు. ఈ పారిశ్రామికులు బీదవారు. వీరిజీవనోపాధికే ప్రమాదం వాటిల్లే పరిస్థితులేర్పడు తున్నాయి. అంతేకాకుండా ప్రజలకు కావలసిన బట్టల ఉత్పత్తికికూడా దెబ్బతగులుతుంది. ప్రభుత్వం వెంటనే కంట్రోలును అమలు జరిపించడానికి, ప్రభుత్వ డిపోల ద్వారాగాని, కో-అపరేటివ్ స్టోర్సు ద్వారాగాని నూలు సప్లయి చేయించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి.

★

రాజమండ్రి స్పిన్నింగుమిల్లు కార్మికుల దుస్థితి

శ్రీ సత్యనారాయణ స్పిన్నింగు మిల్లు (రాజమండ్రి) మూతబడి రెండు మాసాలయింది. నూలు కొరతయిన ఈరోజుల్లో నెలకు 150 బేళ్ల నూలు ఉత్పత్తిచేసే మిల్లు ఆగిపోవడం ఎంతనష్టదాయకమో వేరే చెప్పనక్కరలేదు. ఈ కరువురోజుల్లో అక్కడి కార్మికుల అవస్థ ఊహించుకోవచ్చు. ఈనెల రెండవ తేదీని రాజమండ్రి తహసీల్దారు మిల్లు కార్మికసంఘ నాయకుల్ని, యజమానులను పిలిపించి అన్నివిషయాలను విచారించారు. వెంటనే మిల్లును తిరిగి నడిపించడానికి ప్రయత్నించకపోతే ప్రభుత్వం మిల్లును స్వాధీనపరచుకోవలసి వస్తుందని హెచ్చరించారు. మిల్లును తిరిగి నడపడంకోసం కాచుకొనిఉన్న కార్మికులకు అడ్వాన్సు యివ్వాలని యజమానులతో చెప్పారు.

పరిస్థితులు యిలా ఉండగా మొన్న 5 వ తేదీన అగ్నిప్రమాదం జరిగింది. మిల్లులో పనిచేసే 300 మంది కార్మికుల్లో 150 మంది మిల్లు యజమానులు కట్టించిన 56 గుడిసెల్లో నివసిస్తున్నారు. ఈ గుడిసెలన్నీ తగులబడ్డాయి. కార్మికులు చెల్లాచెదరుకుండా యింతవరకు యూనియన్ నిలిపింది.

ఇకనైనా వెంటనే మిల్లును నడిపే ఏర్పాట్లు చేయకపోతే నిపుణులైన ఈ కార్మికులు ఏదోమరొకవృత్తి చూచుకొని పోక తప్పదు. తద్వారా నూలుఉత్పత్తికి పెద్ద దెబ్బ తగలక తప్పదు. కాబట్టి ప్రభుత్వం తక్షణం జోక్యం కలిగించుకోవాలి.

పరిచయం

"ఆంధ్రమహిళ"

స్త్రీల సచిత్రపక్షపత్రిక
విడిసంచిక 8 అణాలు.

★

సంపాదకులు :
గుమ్మిడిదల దుర్గాబాయమ్మ ఎం.ఎ.బి.యల్..

పత్రికలకు :
ఆంధ్రమహిళాసభ
మైలాపూరు, మద్రాసుకు వ్రాయాలి.
మొదటిసంచిక 15-5-44 న వెలువడింది.

★

ఆంధ్రదేశంలో స్త్రీల సమస్యలగూర్చి శ్రద్ధవహించి స్త్రీలచే నడుపబడు పత్రికఇది.

ఈ రోజులలో పత్రికలునడుపుటకు ఉన్న యిబ్బందులు అందరకూ తెలిసినవే. ప్రభుత్వ అనుమతి దొరకుట కష్టం. ఆపైకాగితముధర 4 గింతలు పెరిగిపోవుట. అయినప్పటికీ, స్త్రీలయొక్క నిత్యజీవితసమస్యలను తెలియజేసి, వారిని విజ్ఞానవంతులుగా తయారు చేయాలని ఆతురపడుతున్న ఆంధ్రమహిళా సభవారు యీ ప్రయత్నానికి పూనుకున్నారు. దీనికి ఆంధ్రస్త్రీలందరూ కృతజ్ఞత తెలియజేయాలనివుంది.

ఈ రోజులలో స్త్రీలు, పురుషులతో సమానమా లేదా అనేప్రశ్న ప్రతిచోటా వుదయిస్తోంది. దీనికి చక్కని సమాధానం వచ్చేటట్లు యీ పత్రికలో "గాంధీగారు ఏమంటారు? స్త్రీలు పురుషులకంటే హీనమా" అనే వ్యాసం వుపయోగపడుతుంది.

"నవ్యస్త్రీ" అనే వ్యాసంలో యిప్పుడు వట్టభద్రులైన స్త్రీలు కేవలమూ ధనోపార్జనమాత్రమే ప్రధానంగా పెట్టుకొనకుండా దేశపరిస్థితులను గమనించి, తోటి సోదరీమణులకు జ్ఞానోదం కలుగజేసి, జాతియొక్క పురోభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. ఈ వ్యాసంచదివినట్లయితే విద్యావతులైన స్త్రీలకు సంఘసేవలో ఎంత బాధ్యత నిర్వహించాలో గోచరమౌతుంది.

"పాపాయిపోషణ" అనే వ్యాసంలో బిడ్డలను పెంచే పద్ధతులు శాస్త్రీయంగా నిరూపిస్తూవ్రాయలేదు. వ్యాసంలో 3 వంతులు బిడ్డ ముచ్చట్లనుగూర్చి వ్రాయబడింది. ప్రతి స్త్రీ చదివి ఆచరించుటకు ఉపయోగపడే పద్ధతులు ఎక్కువగావ్రాస్తే బాగా వుండేది.

'గ్రంథాల యావశ్యకత' అను వ్యాసంలో గ్రంథాలయాలవల్ల స్త్రీల విజ్ఞానం ఎలా అభివృద్ధి చెందేదీ వ్రాసి, అవి లేకపోయినందువల్ల కల్గేనష్టాన్ని వ్రాస్తే బాగావుండేది. భాష కూడా చదువుకొన్న స్త్రీలకు తప్ప సామాన్యస్త్రీలకు అంతబాగా అర్థంకాదు. 'కద్రువ' నాటికవల్లకూడా స్త్రీలలో వుండే మూఢత్వం ఎట్లా పరిణమిస్తుందో తెలుసుకోవచ్చు. పత్రికకొక నాటికవుండటంకూడా చదివే వారికి వుషారిస్తుంది. కాని అవి నిత్యజీవిత సమస్యలమీదవుంటే యింకా బాగుంటుంది. (బాల్య వివాహాలు, వితంతు వివాహాలు, యిలా మహిళాసంఘ ఆశయాలను తెల్పుతూవుంటే ఎక్కువ ఉపయోగపడుతుంది. 'దూరసీమల నారీప్రపంచం' యీ హెడ్డింగుక్రింద ఒక్కొక్క దేశంలో స్త్రీలు ఎలా వుండేది వ్రాస్తూవుంటే ప్రపంచ స్త్రీలందరినిగూర్చి తెలుసుకొనుటకు వీలుంటుంది. అలాగే మన దేశంలో వివిధ ప్రాంతాల స్త్రీలు, వారి ఉద్యమాలను గూర్చికూడా వ్రాస్తే బాగుంటుంది.

ఇంకా విజ్ఞానాభివృద్ధి చెందుటకు అనేక వ్యాసాలతోనూ, బాలబాలికలకుకూడా ఉపయోగించుటకు ఒక పేజీ ప్రత్యేకిస్తారట ఈ పత్రిక చదువుటవల్ల ఆంధ్రస్త్రీలు తమ విజ్ఞానాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చును. అందులో 3 వంతుల వ్యాసాలు స్త్రీలువ్రాసినవే దీన్నిబట్టి స్త్రీలు అంతాప్రయత్నించితే తప్పకుండా విజ్ఞానవంతులుగా తయారు కాగలరు. కాబట్టి ప్రతిస్త్రీ దీనిని తప్పక చదవాలి.

★

★ స్వీకారం

ప్రజాయుద్ధం

రచయిత : కాలినిన్
అనుసరణ : పరుచూరి రామకోటయ్య.
వెల అరణాలు.

★

సోవియటురష్యాలో

రచన : కొత్తపల్లి రామసుబ్బయ్య.
వెల 8 అణాలు.

★

గాంధీజీ

రచన : లూయీఫిషర్
అనుసరణ : దేవదాస్
వెల 8 అణాలు.
ఈ మూడు గ్రంథాలు సంస్కృతి గ్రంథమండలి, మద్రాసువారివి.

★ ఆంధ్రలో ఆహారసమస్య ★

సత్తెనపల్లిలో తిండిదొంగల ఆట కట్టింది

జిల్లాకలెక్టరు బియ్యంధర కంట్రోల్‌చేసినా, సత్తెనపల్లిలో వర్తకులు బియ్యం బస్తా రు. 35 మొదలు రు. 39 వరకు అమ్మారు. రూపాయికి 3½ శేర్లు మొదలు 3 శేర్లవరకూ బియ్యంధర హెచ్చింది. ఇతర తాలూకాలకు ఎగుమతి చేయరాదనే నిషేధాన్ని లెక్కచేయకండా, వర్తకులు రహస్యంగా ఎగుమతులు కూడా చేయసాగారు.

ఇట్టిపరిస్థితులలో ఆహారకమిటీ జోక్యం కలుగజేసికొని ఆందోళన సాగించింది. ఇదివరలో ఈకమిటీ కిరోసిన్ రేషనింగును సాధించింది. దొంగమార్కెటును ఆపమని, కంట్రోలురేటుకే బియ్యం అమ్మవలసిందని ఆహారకమిటీవారు షాహుకార్లకు విజ్ఞప్తి చేశారు. కాని వారులెక్కచేయనందున తహశీల్‌దార్‌వద్దకు రాయబారంవెళ్లి సంగతులు విశదపరిచారు. షాహుకార్లను పిలిపించి, కంట్రోలుధరకే అమ్మాలనీ, తన పర్మిషన్ లేనిదే స్టాకును అమ్మవలదనీ, తహశీల్‌దార్ వర్తకులకు తెలియజేశాడు. కాని వర్తకులు లెక్కచేయలేదు.

ఆహారకమిటీ వాలంటీర్లు ఈ దొంగ వ్యాపారాన్ని పట్టుకొన్నారు. వర్తకులు అదనంగా వసూలుచేసిన 100 రూపాయలను బియ్యం కొన్నవారికి తిరిగిఇప్పించారు. ఇతర తాలూకాలకు పోతున్న 100 బస్తాలను వలంటీర్లు పట్టుకొని ఆపుచేశారు. ఆరోజున వలంటీర్లను ప్రాధేయపడి రూపాయకి 4 శేర్లు చొప్పున వర్తకులు అమ్మారు ఇదంతా జిల్లా కలెక్టరు ధాన్యంధరకంట్రోలుచేసిన 10 రోజులకే జరిగింది. కాని రెండురోజులు మాత్రమే చిల్లరగా రూపాయికి 4 శేర్లు అమ్మి, చాటుగా బస్తాలను ఎక్కువ ధరకు అమ్మారు.

ఆహారకమిటీ వెంటనే ఈవిషయాన్ని అధికార్లకు తెలియజేసింది. తహశీల్‌దారు వర్తకులను పిలిచి స్టాకు లెక్కలను జూస్తే, గత దినం రెండువేల బస్తాలుంటే, ఆరోజు 1100 బస్తాలు మాత్రమే ఉన్నట్లు తేలింది. తహశీల్‌దారు తాలూకా ఆఫీసులో ఒక డిపో తెరిపించాడు. రు 1-0-3 కి 4 శేర్లు చొప్పున అమ్మించారు. కాని, 12 వేల మంది పట్టణ ప్రజలు, ఇతరగ్రామాల నుండి వచ్చే 2 వేల మంది ప్రజలకు ఒక్క డిపోవల్ల పంపకం ఎలా సాధ్యమౌతుంది? 60 దుకాణదార్లవల్ల జరుగుతున్న పంపకం ఒక డిపోద్వారా జరగడం అసంభవం. ఆహారకమిటీ వలంటీర్లు ఎంత ప్రయత్నించినా, లాభంలేకపోయింది. బియ్యంకోసం గంటల తరబడి కూర్చొని, పనిపోగొట్టుకొని ప్రజలు అవస్థపడసాగారు.

ఇంకా ఎక్కువ డిపోలు పెట్టించమని, రేషనింగు పెట్టించమని, రేషనింగు పెట్టించేలోపుగా కిరోసిన్ రేషనింగు కార్డుల ననుసరించి పంపకం జరిపించవలసిందని, తహశీల్‌దారును ఆహారకమిటీవారు కోరారు. తహశీల్‌దార్ ఇది తనవల్ల సాధ్యం కాదన్నారు. ఆ పిమ్మట జిల్లాకలెక్టరువద్దకు రాయబారం వెళ్లిన ఫలితంగా, సత్తెనపల్లిలో 5 డిపోలు తెరిచి పనిచేయసాగారు.

తమ దొంగ వ్యాపారమంతా పడిపోయిందని కుములుచున్న వర్తకులు, డిపోలవద్ద వలంటీర్లు జేబుదొంగలనీ, మరేవేవో కల్పించి తప్పుడు రిపోర్టులు ఇంగ్లీషులో వ్రాసి, అమాయికప్రజలచే సంతకాలు పెట్టించారు. 27 వ తేదీన డిప్యూటికలెక్టరు వచ్చి, 5 డిపోలను మూయించాడు. రు. 1-0-6 కు 4 శేర్ల చొప్పున బియ్యం అమ్మాలని నిర్ణయించాడు. స్వేచ్ఛావ్యాపారం మళ్లా తల యెత్తింది. అహారకమిటీ కార్యదర్శిగారైన డాక్టరు చతుర్వేదుల సీతారామశాస్త్రిగారు డిప్యూటీ కలెక్టరుతో సంప్రదింపగా, అతడు తూలనాడాడు.

ఈ పరిస్థితులను తెలియజేస్తూ మద్రాసు ప్రభుత్వానికీ, జిల్లాకలెక్టరుకూ ఆహారకమిటీవారూ, ఇతర పట్టణప్రముఖులూ టెలిగ్రాములిచ్చారు.

మే 31 వ తేదీన జిల్లాకలెక్టరు సత్తెనపల్లి వచ్చారు. పట్టణ ఆహారకమిటీని పిలిపించారు. ఆహారకమిటీ 300 ప్రజలతో రాయబారంవెళ్ళింది. డిప్యూటీకలెక్టరు చర్యల ఫలితంగా ఏర్పడ్డ పరిస్థితులను వివరించుతూ ఒక మెమోరాండం అర్పించారు. అందులో ఈక్రింది కోర్కెలు కోరారు :

1. కంట్రోలు డిపోలు తెరవాలి
2. 4 శేర్ల బియ్యం రు 1-0-6 నుండి రూపాయికి తగ్గించాలి.
3. కార్డుపద్ధతిపై పంపకం జరగాలి
4. వర్తకులు సరియైన కొలతపాత్రలు ఉపయోగించాలి.
5. నూకలు, జొన్నల ధరలు కూడా కంట్రోలు చేయాలి.
6. తాలూకాకువచ్చే స్టాకులను కంట్రోల్ చేసి, పట్టణగ్రామ అవసరాలనుబట్టి పంపకం జరపాలి.
7. తవుడుధర బస్తా రు 6-9-0 నిర్ణయించాలి.

జిల్లాకలెక్టరుగారు తన సమాధానంలో, కోఆపరేటివ్‌స్టోర్సుకు స్టాక్‌సప్లయి చేయిస్తామని, స్టోర్సు పట్టణంలో వివిధ పదేశాలలో డిపోలుపెట్టి అమ్మేలాగ చేయమని అహారకమిటీని కోరారు. గ్రామాలకు వెంటనేస్టాకు పంపమని తహశీల్‌దారుతో చెప్పారు. హోల్‌సేల్ లైసెన్సుదారులకు వచ్చే లాభంలో రు 0-12-0 కు రు 0-4-0 (బస్తాకి) చిల్లర వర్తకులకు ఇయ్యవలసిందని చెప్పారు. పక్రమంగాఅమ్మని లైసెన్సుదారుల లైసెన్సులను రద్దు చేయవలసిందనీ, తహశీల్‌దారును కోరారు.

సత్తెనపల్లిలో దొంగవ్యాపారమూ, అధిక లాభాలు క్రమంగా అరికట్టబడుతున్నాయి. ఆహారకమిటీకి ప్రజలఅండ హెచ్చవుతోంది. డిపోలవద్ద వత్తిడి పోయింది. ఒకటో వార్డులో ఇండ్లలెక్కలు తీసికొని, తాత్కాలికంగా రేషన్‌కార్డులను తహశీల్‌దారు ఇవ్వ మొదలెట్టాడు.

★

తాలూకాలో ఆహారకమిటీలు

అహారపదార్థాలకు కొరతపడిన ఈతాలూకాలో దాదాపు గ్రామాలన్నీ బయటనుండి వచ్చే అహారధాన్యాలపై ఆధారపడుతాయి.

నానాటికి తీవ్రరూపం దాల్చుతూన్న అహారసమస్యను ఐక్యఆహార కమిటీలద్వారానే పరిష్కరించగలమని గ్రామాలలోని ప్రజలు గుర్తించుతున్నారు. తత్ఫలితంగా ఈ క్రింది గ్రామాలలో ఆహారకమిటీలు ఏర్పడ్డాయి.

రెంటపాళ్ల, మాదల, అంకెలకూరపాడు, - యిచట కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు, గ్రామపెద్దలతోగూడిన అహారకమిటీలు ఏర్పడ్డాయి. అహారసమస్య పరిష్కారంకోసం అంతాకలిసి కృషిచేస్తున్నారు.

★

సత్తెనపల్లి తాలూకా ఆహారకమిటీ సమావేశం.

తాలూకాలో నెలరోజులనుండి పల్లెటూళ్లకు బియ్యం సప్లయి ఆగిపోయి, ప్రజలు ఏన్నో యిబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను చక్కబరుచుటకు 1-6-44 తేదీన తాలూకాఅహారకమిటీ సమావేశం శ్రీ డాక్టర్ శేషావతారంగారి అధ్యక్షతను జరిగినది. మోర్తల అమరారెడ్డి (కారదర్శి) తాలూకా పరిస్థితులను వివరించారు. తరువాత యీ క్రింది తీర్మానాలు చేశారు. (1) అన్ని గ్రామాలకు ధాన్యపు లైసెన్సు లిప్పించి గ్రామ అవసరాలనుబట్టి జొన్నలు బియ్యం సప్లయి చేయించాలి. (2) బియ్యంతోపాటు నూకలకు, జొన్నలకు ధరలు కంట్రోలుచేసి, ధరల కంట్రోలుతోపాటు స్టాకులుకూడా కంట్రోలుచెయ్యాలి (3) రెండువేలరూపాయల షేరుధనంతో అవకాశమున్న ప్రతిగ్రామంలోను కో-అపరేటివ్‌స్టోర్సులు ఏర్పరచాలి. (4) గుంటూరు జిల్లాకలెక్టరు బియ్యం ధరల నిర్ణయంలో చూపెట్టబడిన బస్తాకి రు 0-12-0 లాభంలో నుండి 0-6-0 చిల్లర వర్తకులకుయిప్పించాలి (5) తాలూకాఆఫీసుకు పెర్మిట్లు వచ్చేవర్తకులకు ఆలస్యం జరగకుండా వెంటనే పెర్మిట్లు యిప్పించాలి. (6) తాలూకా ప్రజలకు కావలసిన అన్ని రకాల చౌకబట్టప్రభుత్వమే వర్తకుల ద్వారా సప్లయిచెయ్యాలి (7) అధికాహారోత్పత్తికి అవసరమైన భృగుబండ, క్రోసూరు, కస్తల, ప్రాజెక్టులు వెంటనేప్రారంభించాలి (8) గ్రామాల్లోఅన్నివర్గాల ప్రతినిధులతో కూడిన అహారకమిటీలను ఏర్పరచుకొని, తద్వారా ధాన్యం ప్రజలకందచెయ్యాలి.

నెల్లూరులో కట్టెలకరువుకు కారణం

నెల్లూరు పట్టణంలో, ఏప్రిల్‌లో ఒక తాత్కాలిక అహారకమిటీ ఏర్పడి పనిచేస్తూ వచ్చింది. మే 18 వ తేదీన పురమందిరంలో జరిగిన సభలో, ఆహారకమిటీ ఏర్పడింది. ఈఆహారకమిటీకిఅధ్యక్షులు ఎ.సి.సుబ్బారెడ్డిగారు (మాజీ మ్యునిసిపల్ చైర్మెన్ - కాంగ్రెసువాది) ఉపాధ్యక్షులలో ఒకరు : జనాబ్ ఆర్. ఎ. అన్సారీ (జిల్లా ముస్లింలీగ్ అధ్యక్షుడు). ఈ కమిటీలో అన్నిపక్షాలవారు ఉన్నారు. కాంగ్రెసు, కమ్యూనిస్టు, ముస్లింలీగ్, రేటుపేయర్లసంఘం, హిందూ మహాసభ, జర్నలిస్టు సంఘం, బ్రహ్మసమాజం - మొదలగు వివిధసంస్థలకు చెందినవారేగాక, ఇతరపురప్రముఖులుకూడ ఇందులోవున్నారు.

ఈ అహారకమిటీ గతనెల 21 వ తేదీన జరిపిన సమావేశంలోనూ, 28 వ తేదీన జరిపిన బహిరంగసభలోనూ, ప్రజల అవసరాలను గుర్తించి - ముఖ్యంగా కట్టెలకొరతను గుర్తించి - చర్చించి కొన్నిసలహాలిచ్చింది.

అసలీ కట్టెలకరువు ఎందువల్ల ఏర్పడింది?

నెల్లూరులో షుమారు 4 మాసాలనుండి కట్టెలు, బొగ్గులు సరిగా దొరకక ప్రజలు నానా బాధలు పడుతున్నారు. కలెక్టరు వీటి ధరలను కంట్రోలు చేసినాడు. అడవుల్లోని కూపులనుండి టౌనుకు సరఫరా చేయుటకు ఒక హోల్‌సేల్‌వ్యాపారస్తుని నియమించాడు. కూపు కంట్రాక్టర్లు టౌనుకుగాను కొంత కోటా యివ్వాలని నిర్ణయించాడు. ఇన్ని చేసినా, కట్టెలకరువు తగ్గలేదు. ప్రస్తుతం ప్రతిరోజు సరాసరి 4 లేక 5 బండ్లు మాత్రమే వస్తున్నవి. కాని టౌనుకు నెలకు 1500 టన్నులకట్టె, 4500 బస్తాల బొగ్గు కావాలి.

లోపం ఎక్కడజరుగుతున్నది? ఎందువల్ల యీ కరువు ఏర్పడింది?

(1) అడవుల్లోని కూపు కంట్రాక్టుదారులు తాము నెల్లూరికి యివ్వవలసినకట్టె, బొగ్గు యిచ్చుటలేదు. వారు యివ్వనప్పుడు వారి మీద కలెక్టరుగారు తగినచర్య తీసుకోలేదు. మదరాసులో బొగ్గుకు కంట్రోలులేదు. అందుచే, బస్తాధర రు 5-0-0 వరకూ పెరిగిపోయింది. నెల్లూరులో దాని కంట్రోలుధర రు 2-0-0 మాత్రమే. పైగా మద్రాసుకు బొగ్గు ఎగుమతిమీద నిషేధంలేదు. అందుచే కంట్రాక్టుదారులు ఎక్కువగాబొగ్గు కాల్చి, మద్రాసుకు ఎగుమతిచేసి అధికలాభాలు సంపాదింప చూస్తున్నారు.

(2) బండ్లవారు ఎక్కువ బాడుగలు కోరుతున్నారు. నెల్లూరికి బొగ్గులబస్తాకు 0-8-0 యిస్తే, గూడూరు అదే దూరానికి 0-12-0 యిస్తున్నారు. మద్రాసుకు బొగ్గు ఎగుమతిచేసేవారు యీ విధంగా బండ్లబాడుగలు విపరీతంగా పెంచేసేటప్పటికి, నెల్లూరికి తక్కువ బాడుగలకు తోలడం ముగించుకున్నారు. పైగా ప్రస్తుతంవారికి నెల్లూరికి ఇస్తున్నబాడుగ బండికి రు 11-0-0 బొత్తుగా చాలదు. కొత్త సంవత్సరానికికాంట్రాక్టును, అడవి'కూపు'లు మార్చినెలలో ఇవ్వాలి. కాని ఇంతవరకు ఈయలేదు. ఇచ్చి పని ప్రారంభించడానికి ఇంకా 15 రోజులు (21వ తేదీ దాకా) పట్టవచ్చు. అందుచే అడవులలోకట్టె బొగ్గు విరివిగా చేయడానికి వీలుపడిందికాదు.

28 వ తేదీన జరిగిన బహిరంగసభలో పైవిషయాలను తెలియజేయడమేగాక, జూన్ 3వ తేదీన కలెక్టరువద్దకు ఆహారకమిటీ రాయబారంవెళ్లి, ఈ క్రిందిసూచనలు చేసింది.

1. 'కూపు' కంట్రాక్టర్లు, నెల్లూరికివ్వవలసిన కోటాను ఇచ్చేటట్లు కలక్టరుచూడాలి. అలాయివ్వనివారిపై తగినచర్య తీసికోవాలి.
2. ఈ సంవత్సరానికి యివ్వవలసిన కాంట్రాక్టులు వెంటనే యివ్వాలి.
3. బండివాళ్ళకు బాడుగ హెచ్చించాలి.
4. స్టాకు ఏర్పడినపిమ్మట టౌనులో కనీసం 20కట్టెలడిపోలు తెరవాలి. (ఇప్పుడు 22 వార్డులకు 10 డిపోలు మాత్రంఉన్నాయి.)
5. ఈ సమస్యను చర్చించి పరిష్కరించుటకు కలక్టరుగారు అందరితో కలిసిన ఒక సమావేశం జరపాలి.

బెంగాల్ వైద్యసహాయ సమీకరణ సంఘం

"బెంగాలును రక్షించటానికి మనమందరం సర్వశక్తి ప్రయత్నించాలి యువకులంతానీ దీక్షతో పనిచేస్తే బెంగాల్ సమస్య కొంతవరకయినా పరిష్కారింపగలము. మొట్టమొదట ఆహార సమస్యను పరిష్కరించాలి. రోజుకు ఒక పూటయినా సరియయిన తిండిఉంటే ఇన్ని జబ్బులు వ్యాపించవు. తిండిలేకపోతే మందులేమి చేయగలవు." అంటూ నెల్లూరుజిల్లా మెడికల్ ఆఫీసరు డాక్టరు ప్రభు, గతమాసం 29వ తేదీని నెల్లూరులో 'వైద్యసహాయ సమీకరణసంఘం' ప్రారంభోత్సవం జరుపుతూ అన్నారు. బెంగాలుకు మందులు మొదలయిన సహాయం పంపడానికి, నెల్లూరు జిల్లా సముద్రతీరప్రాంతాల్లో వ్యాపించిన జాడ్యాల నరికట్టడానికి ఈసంఘం ఏర్పడింది. మద్రాసులోని 'బెంగాల్ వైద్యసహాయ సమీకరణసంఘం' చేస్తున్న పనిని డాక్టరు లాంధాసుగారు వివరించారు. ప్రముఖకాంగ్రెసువాది, ప్రకృతివైద్యనిపుణుడు, శ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్య, యం. యల్. ఎ. గారు బెంగాలుకి సహాయంచేయవలసిన అవశ్యకతను నొక్కిచెప్పారు.

తరువాత కమిటీ ఎన్నికలు జరిగాయి. మునిసిపల్ చైర్మన్ శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డిగారు అధ్యక్షులుగను; మునుపటి చైర్మన్ ఏ. సి. సుబ్బారెడ్డిగారు (కాంగ్రెసు), మాజీ జిల్లాబోర్డు అధ్యక్షులు శ్రీ వంగల్లు కోదండ రామరెడ్డిగారు (కాంగ్రెసు), జనాబ్ అన్సారీ (ముస్లింలీగ్), అమెరికన్ హాస్పిటల్ డాక్టరైన మిసెస్ మూరిస్‌గారు ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. కామ్రేడ్సు దశరథరాం, రఘునాథరెడ్డి, శ్రీరాములు కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు.

బెంగాల్ నిధి వసూళ్లు

24-5-44 తేదీ ప్రజాశక్తిలో ప్రకటించిన మొత్తం	8,560	0	0
వేటపాలెం కల్చరల్‌దళం రైలులో వసూలు చేసినది.	4	0	0
కె. యస్. దత్తుగారు తెనాలి	65	0	0
కోగంటి కోటయ్యగారు.	40	0	0
గారపాటి లక్ష్మణరావు.	8	6	0
వెంట్రప్రగడ బ్యాండుదళం రైలులో వసూలు చేసినది.	2	10	9
బి. యస్. రెడ్డి-ఏకాంబ్రకుప్పం	6	2	0
వర్లాకిమిడి నుంచి	19	0	0
పోతునూరునుంచి	30	0	0
మరికుంటపల్లి అనంతపురం జి॥	11	3	9
అల్లూరు—నెల్లూరుజిల్లా	13	12	0
లాంకోము-వైజాగ్‌జిల్లా	9	12	0
పడలి.	2	13	0
కాజ సోమశేఖరంగారు	10	0	0
చినపాలెం వసూళ్లు.	20	1	6
వెంట్రప్రగడ బ్యాండ్‌దళం రైలులో వసూలు.	0	13	9
రాజమండ్రి రైలర్సు యూనియన్	20	0	0
అత్తకూరు-మేడే రోజున.	16	0	0
నర్సారావుపేట.	25	0	0
ఉప్పుగుండూరు మహిళా సంఘం	6	10	0
నెల్లూరు.	5	3	0
తిరుపూరుతా॥ కోటపాడు	7	8	0
జానపల్లె తా॥ కొండపాటూరు.	38	9	3
చివుకుల శేషశాస్త్రి.	2	0	0
మునునూరు వెంకటరత్నంగారు స్వతంత్రపురం దివి తా॥	3	0	0
అబ్దుల్ సలీం-నర్సాయపాలెం	5	13	0
	8,933	10	0

ఈమొత్తంలో 19-5-44 తేదీనాటికి పీపుల్సురిలీఫ్ కమిటీకి రు. 8,560 లు పంపబడినాయి. మిగిలిన 373 10-0 ఈరోజున పైఆడ్రసుకు పంపబడినాయి.

బెజవాడ
7—6—44 సంపాదకవర్గం

సవరణ

24-5-44 వ తేదీ సంచికలో "బెంగాలు నిధి వసూళ్లు" క్రింద 'పర్చూరి గోపాలకృష్ణయ్య, అముదాలపల్లి 9-0-0' అని పడింది. ఇదిపొరపాటు. 'మండవ చారువతిగారి పెండ్లి సందర్భంలో (ఆముదాలలంక) 5-0-0; పర్చూరి గోపాలకృష్ణయ్యగారు పెండ్లికి యిచ్చినది. 4-0-0' అని ఉండాలి.



గుంటూరుజిల్లా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి హనుమంతరావు (నెత్తిమీద తట్ట) జిల్లా రైతుసంఘ కార్యాలయ కార్యదర్శి కంతంనేని సుబ్బారావు

గ్రామస్థుల చొరవ

ఇందుపూరు (నెల్లూరుజిల్లా) గ్రామానికి ½ మైలు మేరలోరోడ్డు లేదు. దీనివల్ల బళ్లు పోవడానికే కాక, వర్షాకాలంలో పశువులు, మనుష్యులు నడవడానికి కూడా చాలాకష్టంగా వుంటుంది. కాంగ్రెసు మంత్రివర్గాలరోజుల్లో ఇక్కడ రోడ్డువేయించడానికి శాంక్షనయింది. పని ప్రారంభించి, గులకతోలించారు కూడా. ఇంతలో యుద్ధంవచ్చింది. కొత్తరోడ్డు నిర్మాణానికి ఇప్పుడు వీలులేదని శాసించింది ప్రభుత్వం. అప్పటికప్పుడే ఖర్చుపెట్టిన 5, 6 వేలు దండగకావలసిందే. కాని, గ్రామస్తులు అలా కానివ్వదలచుకోలేదు. రోడ్డు పూర్తిచేయడానికి వాళ్ళే చొరవతీసుకున్నారు. స్థానిక కాంగ్రెసుప్రముఖుడు ఏలూరు బాబురెడ్డిగారు, పెద్దరైతు నూకలపాటి వెంకారెడ్డిగారు ప్రధానంగాకార్యభారంవహించారు. గ్రామంలో చందాలు పోగుచేశారు. ఉచితంగా పనిచేయడానికి గ్రామస్తులు ఉత్సాహంతో ముందుకు వచ్చారు. బండ్లున్నవారు చాలమంది ఉచితంగా బండ్లుపంపారు. పెద్దరైతులు కూలీలను పంపారు. కొందరు రైతులు బియ్యం, ధాన్యం విరాళాలిచ్చారు. 300 మందికి సరిపడే పచ్చళ్లు, మజ్జిగ పంపారు స్త్రీలు. వంటలు, వడ్డనలకు 10 మంది వచ్చారు. ఈ విధంగా అన్నివైపులనుంచివచ్చిన సహకారంతో గతమాసం 28 వ తేదీని పని ప్రారంభించారు. పాటలతోను, నినాదాలతోను 150 మంది బారులుతీరి పనిలోకి వెళ్లారు. వీరిలో 20 మంది స్త్రీలు. మట్టిమోత అంటేఏమిటో తెలియని యువకులు ఎందరో పనిలోకివచ్చారు. ప్రజల కుపయోగపడగల పనులను ప్రజలే చొరవతో కొనసాగించగలరనడానికి ఇదొకనిదర్శనం.

★ ★ ★

మూడవ ఆంధ్రరాష్ట్ర జర్నలిస్టుల మహాసభ

'నేషనల్ హెరాల్డు' పత్రికా సంపాదకులుగ ఉండిన శ్రీ కొటంరాజు రామారావుగారి అధ్యక్షతక్రింద ఈనెల 25 వ తేదీని 'మూడవ ఆంధ్రరాష్ట్ర జర్నలిస్టుల మహాసభ రాజమండ్రిలో (హిందూసమాజంలో) జరుగుతుంది.

ఆంధ్రదేశంలో యింతవరకు వెలువడిన పత్రికల నన్నిటిని మహాసభ సందర్భంలో ప్రదర్శించడానికి, 'మహాసభ సంచిక' ను ప్రచురించడానికి కార్యకర్తలు నిర్ణయించారు. పాత, ప్రస్తుత, పత్రికలను, పత్రికల చరిత్రలను, సంపాదకుల, సహాయ సంపాదకుల, విలేఖరుల, జర్నలిస్టుల జీవిత చరితను (క్లుప్తంగా) వ్రాసి, బ్లాకులుగాని, ఫోటోలనుగాని చేర్చి 20 వ తేదీలోగా శ్రీ చిలకమర్తి సత్యనారాయణాచార్య, ఎడిటర్ - శ్రమజీవి, రాజమండ్రికి పంపవలసిందని ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీపాలకోడేటి సూర్యప్రకాశరావుగారు కోరుచున్నారు.

★

నెల్లూరుజిల్లాసముద్రప్రాంతంలో జాడ్యాలు చెలరేగుతున్నాయి.

నెల్లూరుజిల్లా రైతుసంఘకార్యదర్శి బస్వారెడ్డి శంకరయ్యగారు యీ క్రింది ప్రకటన చేస్తున్నారు:

"నెల్లూరుజిల్లా సముద్రప్రాంతాల్లో జాడ్యాలువిపరీతంగా వున్నాయి. కోవూరు తాలూకాలోని ఊటుకూరు, రామతీర్థం, దండిగుంట గ్రామాల్లో 3000 మంది మలేరియాతో మంచమెక్కారు. దరిదాపు 300 మంది మరణించారు.

"నెల్లూరుతాలూకాలోని మైపాడు గ్రామంలో మూడోవంతు ప్రజలు చలిజ్వరంతో బాధపడుతున్నారు. కృష్ణాపట్నం, మత్తుకూరు వగయిరా ప్రాంతాల్లోకూడా యీ జాడ్యంవుంది.

స్ఫోటకంకూడా వ్యాపిస్తూంది. వ్యవసాయకూలీలు పనిచేయలేక పోతున్నారు. ఆరోగ్యశాఖవారు కొన్నిమందులు గ్రామమునసబులకు టీచర్లకు పంపించారు. కాని ఇవి ప్రజలకు దొరకడంలేదు.

"అందువల్ల జిల్లారైతుసంఘం ఒక వాలంటీరుదళానికి శిక్షణనిచ్చి యీ మలేరియా ప్రాంతాలకు పంపించదలచుకొన్నది. కాబట్టి వుత్సాహవంతులగు ప్రజాసేవకు లందరూ ముందుకువచ్చి వాలంటీరుదళంలో చేరుతారనీ, ఆరోగ్యశాఖవారు కూడా తగు సహాయము చేస్తారనీ ఆశిస్తున్నాము."

★

భూరివిరాళం

మద్రాసులోని "బెంగాల్ వైద్యసహాయ సమీకరణ సంఘా"నికి శ్రీమతి భవానీదేవిగారు రు. 5000 లు, శ్రీమతి బాలవిశాలాక్షిగారు రు. 2500 లు, శ్రీ వి. రామనాధబాబుగారు రు. 2500లు విరాళాలిచ్చారు. దీనితో ఆ కమిటీ నిధి రు. 15,050 లకు పెరిగింది.

★

శిరువేళ్ళతాలూకా (కర్నూలుజిల్లా) యర్రగుంట్ల గ్రామంలో స్థానికకమ్యూనిస్టులు రు 8-2-0 బెంగాలునిధికి వసూలుచేశారు.



— కాలవత్రవ్వ పనిలో గుంటూరుజిల్లా కామ్రేడ్స్ —

జపాన్ ప్రజాఉద్యమం

— నిఖిల్ చక్రవర్తి

జపాన్ ఫాసిస్టుల దురాక్రమణను జపాన్ ప్రజలు బలపరచడంలేదు. మిలిటరీ పాలకులే ఆశియాఖండాన్ని జయించాలని దురాక్రమణ ప్రారంభించారు. మొదట్లో విజయాలు సంపాదించారు. తద్వారా అమాయక ప్రజలను తమకూ్కడా ఏదో లాభం వస్తుందనుకునేలా మోసం చేయగలిగారు. కాని యిప్పుడు క్రమంగా పరిస్థితులు మారిపోతున్నాయి. యుద్ధానికి వ్యతిరేకంగానూ, శాంతికోసమూ, ప్రజాఉద్యమం నిర్మించబడుతూంది. మిలిటరీ తత్వాన్ని నాశనంచేసి ప్రజాస్వామిక పరిపాలన స్థాపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జపాన్ ప్రజాఉద్యమాన్ని గురించి చెప్పాలంటే జపాన్ కమ్యూనిస్టుపార్టీ చరిత్రతోనే ప్రారంభమవుతుంది. కమ్యూనిస్టుపార్టీ 1922 సంవత్సరంలో స్థాపించబడింది. నాటి నుంచి జపాను ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతూంది. యుద్ధంవచ్చాక సమ్మెలను నడిపింది. 1941 కోబె విమాన కర్మాగారంలో కార్మికుల సమ్మెను నడిపింది.

చైనా సహాయం

జపాన్‌లో యుద్ధవ్యతిరేక ఉద్యమం నడపడం ఎంతోకష్టంతో కూడినపని. రహస్యంగా, జాగ్రత్తగా పనిచేయాలి. యుద్ధంలో ప్రథమ విజయాలవల్ల పెరిగిపోయిన జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా నిలబడవలసి వచ్చింది. అనేకవేలమంది ప్రజాసేవకులు కాల్చివేయబడ్డారు. అనేకవేలమంది జైళ్ళలో మ్రగ్గుతున్నారు. ఈవార్తలు వ్యాపించకుండా పత్రికలపై నిషేధముంది.

జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా ప్రజలు గావించే స్వాతంత్ర్య యుద్ధం జపాన్ యుద్ధవ్యతిరేక ఉద్యమానికి ఎంతో సాయంచేసింది. చైనా నాయకులు ప్రారంభంలోనే తాము జపాన్ ప్రజలకు విరోధులం కామని ప్రకటించారు. జపాన్ ప్రజలతో తాము స్నేహంగా ఉండాలని కోరుతున్నామని చెప్పారు అంతేగాక జపానులో రహస్యంగా పనిచేసే ప్రజాసేవకులకు సాయంచేశారు. యుద్ధఖైదీలుగా పట్టుబడిన జపాను సైనికులలో ప్రబోధం గావించారు.

యుద్ధవ్యతిరేక సంఘం

ఉత్తర చైనాలో ఎనాన్ అనుచోట జపాన్ దేశభక్తులు యుద్ధవ్యతిరేక సంఘాన్ని ఏర్పాటుచేసారు. కూజీ, ఒకోనా వగైరా అనేకమంది జపాన్ కమ్యూనిస్టు నాయకులు అచటికి వచ్చిచేరారు. వీరే మొట్టమొదటిసారి జపాన్ ప్రజలు చైనాప్రజలతో పోరాడాలని కోరడంలేదని ప్రకటించారు. తాము కూడ జపాను ఫాసిస్టులను ఓడించడానికి చైనాప్రజలతో కలసిపోరాడుతామని తెలియజేశారు.

జపాన్ యుద్ధవ్యతిరేకసంఘానికి ఇపుడు 34 శాఖలున్నాయి. 1942 తరువాత మందుగుండు కర్మాగారాలలో సమ్మెలు జరిగాయి. వీటిని ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగాఅణచివేసింది. కాని రహస్య ఉద్యమం క్రమంగా అభివృద్ధిచెందుతూనేవుంది. క్రమంగా జపాన్ సైనికులలో సైతం యుద్ధవ్యతిరేకత పెరుగుతూంది. ఉదాహరణకు—1943 లో ఖైదీలుగా పట్టుబడిన జపానువారిలో నూటికి 40 మంది, కావాలని చైనా కమ్యూనిస్టుపార్టీకి లొంగిపోయారు. 1940 లో ఇలాంటివారు నూటికి 7; 1942 లో నూటికి 18 మంది మాత్రమే వుండేవారు.

1944 జనవరిలో యుద్ధవ్యతిరేకుల సంఘ సమావేశం 'ఏనాన్'లో జరిగింది. దీనికి ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశం ఏడుఅంశాలు కలిగిన కార్యక్రమాన్ని నిశ్చయించింది. దానిని అమలుజరపడానికి, జపాన్ ప్రజాస్వాతంత్ర్య సమితిని ఏర్పాటుచేసింది.

(1) శాంతియుతమైన విదేశాంగనీతి; (2) యుద్ధం వెంటనేఆపుజేసి, దానికి కారకులను శిక్షించాలి; (3) ప్రజలకు శాంతి సౌఖ్యాలను యిచ్చే ఆర్థికపాలసీని అనుసరించాలి; (4) యుద్ధాన్ని ప్రోత్సహించే ఫాసిస్టు సంస్థలను అణచివేయాలి; (5) ప్రజాస్వామిక హక్కులను స్థాపించాలి; (6) ప్రజల, సైనికుల, జీవితపరిమాణం హెచ్చించాలి; (7) ప్రస్తుత పేచీకోరుల ప్రభుత్వాన్ని కూలదోసి, అభ్యుదయశక్తులన్నిటితోను కలిసిన ప్రభుత్వాన్ని ఏర్పరచాలి.

ఒకోనా తనఉపన్యాసంలో ఇలాచెప్పాడు: "మేము క్రమంగా బలపడుతున్నాము. మేము నూటికి 95 మంది జపాన్ ప్రజల హక్కుల కొరకు నిలబడిపోరాడుతున్నాము. జపాన్ ప్రజలు మమ్ములను బలపరుస్తారని విశ్వసించుతున్నాం. స్వాతంత్ర్యజెండా మాచేతులతోనే జపానుపై ఎగురవేస్తాము."

ఇలాంటి జపాన్‌విప్లవకారులకు ఉత్తర చైనాలో రక్షణయివ్వబడుతోంది. ఈ విషయం ఒక సంగతి తెలియజేస్తుంది. చైనాలోగాని, జపానులోగాని, ప్రజలందరు ఫాసిస్టులకు వ్యతిరేకులు. ప్రపంచ ప్రజలందరూ ఫాసిస్టుదుండగీడులను నాశనం చేయాలనే కోరుతున్నారు. అపుడే నిజమైన ప్రజాస్వాతంత్ర్యం స్థాపించబడుతుందని ఆశించుతున్నారు.

జెండా పాట

(బాలసంఘాలకు)

ఎగురవెయ్, ఎగురవెయ్,
జెండా ఎగురవెయ్ —
చదువులకోసం సాములకోసం
ఆటల పాటల కోసమూ -
ఎగురవెయ్ —
దేశ స్వాతంత్ర్యానికి
శాంతికి అభ్యుదయానికి -
ఎగురవెయ్ —
జపాను వాళ్ళకు సింహస్వప్నం
జర్మని గుండెల్లో బల్లెమూ -
ఎగురవెయ్ —
ఆడేపాడే బాలురజెండా
రెపరెపలాడుతు ఎగరాలీ,
మిలమిలమింటను మెరవాలీ -
ఎగురవెయ్ —
వీర శివాజీ ఝాన్సిలక్ష్మి
పుట్టిన వీరగడ్డపై
ఎగురవెయ్, ఎగురవెయ్,
జెండా ఎగురవెయ్ —

— విద్వాన్, ప్రయాగ
— కాకుమాను సుబ్బారావు

★ చిన్నకథ

ఖాసిమ్ బీ

★

ఖాసిమ్‌బీ ముస్లిం స్త్రీ అని పేరువల్లనే తెలుస్తుంది. సోవియటు కజకస్థాన్‌లో, సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో సభ్యురాలు. చిన్నతనంలోనే పెండ్లయింది. ఉస్మాన్ అనే యువకుణ్ణి పెండ్లి చేసికొంది.

కొంచెం సుఖపడటం అంటే ఏమిటో సమిష్టి వ్యవసాయక్షేత్రంలోకి వచ్చాకనే వీరు తెలుసుకోగలిగారు. ఇంకా సుఖపడేరోజులు ముందున్నాయి అనుకొంటూ ఆ దంపతులు కలలుగంటున్నారు. కాని ఇంతలోసోవియట్‌పై నాజీరాక్షసులు యుద్ధం ప్రకటించారు.

ప్రభుత్వం పిలవకపూర్వమే ఉస్మాన్ వలంటీరుగా యుద్ధరంగానికి బయలుదేరాడు. చాలాకాలంవరకు ఉస్మాన్‌జాడ తెలియలేదు. ఒకసారి, ఉస్మాన్ గాయపడి హాస్పిటల్‌లో చేర్చబడ్డాడంటూ, క్లుప్తసరిగా నాల్గుముక్కలు వ్రాసిన ఉత్తరం ఒకటి ఖాసింబీకి వచ్చింది. అంతకుమించి మరేమీ అతనిజాడ తెలియలేదు.

భర్త ఆరోగ్యాన్ని గురించి తెలియకపోవడంవల్ల, ఖాసింబీ ఆందోళన పడసాగింది. ఎలాంటిస్థితిలో వున్నాడు? కాళ్లూ చేతులూ సరిగావున్నాయో లేవో? కుంటివాడయ్యాడేమో? అసలు బ్రతికి బయటపడి ఇంటికి చేరతాడో లేదో? అంటూవిచారించసాగింది. భర్త గాయాలను గురించి ఏవేవో ఊహలతో తన మనస్సులో కొన్ని చిత్రాలను నిర్మించుకొనేది.

ఈ ఆందోళనను ఉపశమింపజేసికోడం ఎలా? తన భర్త ఏమాతృదేశాన్ని ప్రేమించి గాయపడ్డాడో, ఆ మాతృభూమిని మరింత సేవచేయడంతప్ప మరొకదారిలేదు. ప్రక్కజిల్లాలో ఒక విద్యుచ్ఛక్తి యంత్రనిర్మాణం జరుగుతోంది. అది త్వరలో పూర్తియితే విద్యుచ్ఛక్తికి కొదవఉండదు. ఇంకా ఎక్కువ యుద్ధసామగ్రి తయారుచేయవచ్చు. పిశాచ హిట్లరు సైన్యాలను త్వరలో ఓడించవచ్చు. ఆ ప్రాంతంలో ఖాసింబీ వూరివాళ్ళు-తన స్నేహితులు-చాలమంది పనిచేస్తున్నారు. తానుకూడా వెళ్లాలనుకుంది. వ్యవసాయక్షేత్ర కార్యనిర్వాహక సంఘంవారి అనుమతిపొంది ప్రక్కజిల్లాకు వెళ్ళింది.

★

విద్యుచ్ఛక్తి యంత్రనిర్మాణ ప్రదేశం. రెండుకళ్ళూ పోయిన ఒక గుడ్డివాడు, ఆ యంత్ర నిర్మాణ శాఖాధికారి వద్దకు వచ్చాడు. బలిష్ఠమైన శరీరం, చేతిలో ఒకకర్ర. కర్రతో దారి తడుముకొంటూ, సైనికునిలా గట్టిగా అడుగులువేసికొంటూ, అధికారిని సమీపించాడు. తనకేదైనా పనిచూపింపమని అడిగాడు.

"కామ్రేడ్! నీవు చూస్తే యుద్ధంలో గాయపడిన సైనికునిలా ఉన్నావు. నీరెండు కళ్లూ పోయాయి. ఇక్కడ పనిలో మంచి ఆరోగ్యవంతులనే చేర్చుకొంటాం. నీవు ఇంటికిపోయి విశ్రాంతితీసికో" అంటూ పరామర్శగా మాట్లాడాడు అధికారి.

"నావొంట్లో కావలసినంత బలంవుంది. నాకండ్లు పోగొట్టిన నాజీహంతకులమీద కసి తీర్చుకోడానికి నేను పనిచేయాలి. నేను పని చేయగలను. పని ఈయకపోతే నేనూరుకునేది లేదు. కాళ్ళు ముడుచుకు కూర్చుని ఇతరులను కష్టపెట్టడం నాకిష్టంలేదు."

— అంటూ సమాధానం ఇచ్చాడు ఆ అంధుడు.

అధికారి అతనిమాటలను త్రోసిపుచ్చలేకపోయాడు. అతని మట్టి తవ్వే పనిలోకి పంపాడు.

పొద్దస్తమానం, కష్టపడి పారతో పని చేసేవాడు. ఒకనాటి సాయంత్రం తాను ఉండే నివేశస్థలంలో ఏవోకబుర్లు చెప్పుకుంటున్నారందరూ. అవి ఒక స్త్రీని గురించిన ప్రశంసా వార్తలు. ఆమె ప్రక్కజిల్లానుండి వచ్చిందనియూ, ఎంతోచక్కగా పనిచేస్తున్నదనియూ, వీళ్ళ మాటలలో తేలింది.

అంధుడువూరుకోలేక "ఆమెపేరేమిటి" అని ప్రశ్నించాడు. "ఆమె పేరు ఖాసింబీ" అని సమాధానంవచ్చింది. (మగతా శివ కాలంలో)

ఆరాత్రి గుడ్డివాడు నిద్రపోలేదు. ఆమెను గురించి ఎందుకో ఎంతో గర్వపడ్డాడు. మరునాటి నుంచి ఎక్కువ పారపని చేయడం మొదలుపెట్టాడు. పార విసురుతోంటే, ఎంతో లోతుకుపోయేది. రెండు దెబ్బలతో వల్లిక నిండిపోయేది. ప్రతివారినోటా మన గుడ్డివాడిని గురించే ఏదో ప్రశంస. చివరకు గోడవార్తాపత్రికలో ఇతని ఫొటోకూడ పడింది.

ఖాసిమ్‌బీ గుడ్డివాని ఫొటో చూచింది. అతను పనిచేసే ప్రాంతానికి పరుగెత్తుకెళ్ళింది. దూరాన ఉండగానే, గుడ్డివాడు—ఉస్మాన్—తన భార్య అడుగుల పసిబట్టాడు. రెండు చేతులూ చాచాడు. ఖాసింబీ అతని కౌగిటిలోకి చెంగున దూకింది.

ఇదివరలో వీరిద్దరూ పనిచేసిన సమిష్టి వ్యవసాయ క్షేత్రంలోని సభ్యులంతా వీరి సమాగమానికి హర్షించారు. దంపతులను అభినందించారు. కొన్ని పశువులు, కొంత ధాన్యం కానుకగాయిచ్చి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. వీరిద్దరివల్ల, తమ మాతృదేశమంతటా, తమ గ్రామానికి పేరుప్రఖ్యాతలు రావటంవల్ల ఆగ్రామవాసుల ఉత్సాహానికి అంతులేదు.

(టాస్ ఏజన్సీ)

నెల్లూరులో ఇనుముకొరకు రైతుసంఘ కృషి

— బి. శంకరయ్య

ఆహారోత్పత్తికి యినుముతో ఎంతో అవసరమైన యీ రోజుల్లో, సక్రమమైన ధరలకు యినుమును ప్రభుత్వం సప్లయిచేయనందువల్ల రైతులు అవస్థలపాలవుతున్నారు. పరిస్థితులు విషమించిన తర్వాత ప్రభుత్వం ధరలు కంట్రోలుచేసింది. కాని అమలు జరగడంలేదు. సరఫరా సక్రమంగాజరగడం లేదనీ, యెంత ప్రయత్నించినా ఇనుము దొరకడం దుర్లభంగా ఉన్నదనీ అధికారవర్గం తన అసహాయతను వెల్లడించింది.

ఫిబ్రవరి, మార్చినెలల్లో జిల్లావ్యవసాయశాఖకువచ్చిన 19 టన్నులలో పనికివచ్చే యినుమును (సుమారు 2000 పౌనులు) రైతుసంఘ సిఫార్సుమీద వ్యవసాయడిమాన్‌స్ట్రేటర్ 21 గ్రామాలలో పంపకం చేయించాడు.

కాని స్వలాభపరాయణులైన పెద్ద భూస్వాములకీ పద్ధతి గిట్టక కుతంత్రాల ద్వారా, తమకవసరమైన యినుముకన్నా అదనంగా పోగుచేసుకుంటున్నారు. వారి నాయకుడైన బెజవాడ రామచంద్రారెడ్డిగారు యినుము పంపకంలో రైతుసంఘానికి ఎలాంటి జోక్యం ఉండకూడదని జిల్లా ఆహారకమిటీలో వాదించాడు.

వ్యాపారస్తులకు కొద్దికొద్దిగావచ్చే ఇనుమును దొంగమార్కెట్లద్వారా విపరీత ధరలకు అమ్మప్రయత్నిస్తున్నారు. ఎవరైనా కంట్రోలు ధరకు యివ్వమని అడిగితే, అది కంట్రోలు పూర్వం వచ్చిన సరుకని తప్పుడు సమాధానం యిస్తున్నారు. వ్యవసాయ డిమాన్‌స్ట్రేటరు యిచ్చిన సర్టిఫికేటుకుకూడా పాటించడంలేదు. సరుకును దాచేస్తున్నారు.

నెల్లూరులో కంట్రోలు ధరకన్న ఇనుమును దాదాపు రెట్టింపుధరకు విక్రయించారన్న నేరంమీద దర్శి గురుస్వామిశెట్టి, పైడా సుబ్బారామయ్యగార్లను, రైతుసంఘం వారు వ్యవసాయ శాఖాధికార్ల సహకారంతో పట్టుకున్నారు. వ్యాపారస్తులు సాగిస్తున్న అక్రమాలను పోలీసు అధికార్లకు రిపోర్టు చేసినా వారేమీ పట్టించుకొనడంలేదు. రిపోర్టు చేసినవారిని పోలీసు అధికారులు తూలనాడడంకూడా సంభవిస్తున్నది. ఈ సందడిలో వ్యాపారస్తులు తమ సరుకును భద్రంచేసుకుంటున్నారు.

ప్రజలు యినుము విషయం తమ స్వంత సమస్యగా నెంచుకుని ఆందోళన చేస్తున్నారు. నెల్లూరు పట్టణ ఆహారకమిటీ మహాసభలో యినుమును గురించి తీర్మానం చేయబడ్డది. "నగరజ్యోతి" అనే గోడవార్తాపత్రికమీద వ్యాపారస్తుల దుర్నీతిని విమర్శిస్తూరాసిన ఫలితంగా, దొంగ మార్కెట్టు కొంతతగ్గిందని ఒస్తున్నది. వ్యాపారస్తులు రైతుసంఘంతో రాజీకి రావాలని సూచిస్తూ, ఇకమీద యినుమును కంట్రోలు ధరకే అమ్ముతామంటున్నారు.

ఈ సమస్య పట్టణంలోనేగాక తాలూకా కేంద్రాల్లోకూడా అలజడి కలుగజేస్తున్నది. ఆత్మకూరు యినుపవర్తకుడు పొదుగూరుకు యినుమును రహస్యంగా బండిమీద పంపుతూంటే, రైతువర్కర్లు, ప్రజలు బండిని ఆటకాయించారు. అప్పటినుంచి యెగుమతి ఆగిపోయింది. ఒకవ్యక్తికి అవసరానికిమించి సరుకిస్తే, ఆవ్యాపారస్తుడిమీద పోలీసురిపోర్టు చేయబడ్డది. పోలీసుఅధికార్లు నిర్లక్ష్యంచేశారు. వర్తకుడు కామ్రేడ్ శంకరయ్యపైన ఇనుము దొంగిలించాడని తప్పుడు కేసు పెట్టారు.

300 మంది రైతులు రైతుసంఘం తరపున డిప్యూటీకలెక్టరు వద్దకు రాయబారం వెళ్ళగా, డిప్యూటీకలెక్టరు వర్తకుణ్ణి పిలిపించి గట్టిగా హెచ్చరికచేశాడు. వర్తకుడు కమ్యూనిస్టులమీద నేరారోపణచేయ ప్రయత్నించాడు గాని, నిష్ప్రయోజనమయింది. అప్పటినుంచి కంట్రోలురేటుకు సప్లయిచేస్తున్నాడు. కాని మేలురకం ఇనుమును కంట్రోలుధరకు విక్రయించడంలేదు.

సాగుచేసేతరుణం సమీపిస్తున్నది. ఆహారసమస్య తీవ్రమవుతున్నది. త్వరలో యినుము దొరక్కపోతే పంటలు దెబ్బతింటాయి. ఇట్టి పరిస్థితుల్లో అక్టోబరువరకు యినుము లభించదని వ్యవసాయశాఖ డైరెక్టరు బి. విశ్వనాథంగారు యిచ్చిన ఉపన్యాసం ఆందోళన కలిగిస్తున్నది. కాబట్టి రైతుసంఘాలు, ఆహారకమిటీలు, యీక్రింది కోర్కెల విషయమై తీవ్రాందోళన జరపాలి.

1. వీలైనంతత్వరలో యినుము స్టాకును తెప్పించాలి.
2. వ్యాపారస్తులవద్ద స్టాకును కమాండీరుచేసి, కంట్రోల్ ధరలకు వ్యవసాయ డిపోలలోగాని, కో-ఆపరేటివ్‌స్టోర్సులోగాని, అమ్మించాలి.
3. ఏవూరిలో, యేవ్యాపారస్తుడికి ఇనుము సప్లయిచేస్తున్నారో ప్రకటించాలి.
4. పాతసరకును కూడా కంట్రోలు చేయాలి.
5. గ్రామరైతుసంఘాలు తయారుచేసిన లెక్కల ప్రకారం రైతులకు ఉమ్మడిగా సప్లయిచేయాలి.

(8వ పేజీ తరువాయి) కలెక్టరు (రువ్వంతా ఉక్కార్) గారివద్దకువెళ్లి ఇచ్చారు. దాని ఫలితంగా దుకాణపుఏజంటుపై తగినచర్య తీసికొన్నట్లు తెలిసింది.

ప్రజల వత్తిడిఫలితంగా ఇప్పుడా దుకాణపు ఏజంటు సక్రమంగా ప్రజలకు బియ్యం అందజేస్తున్నాడు.

పుగాకు రైతుల - వ్యాపారస్థుల సంయుక్త సమావేశం

పుగాకు ఉత్పత్తిదారుల సహకార సంఘాలు యేర్పడాలి

పుగాకు ఉత్పత్తి కేంద్రాలలో ఇండియాలోకల్లా గుంటూరుజిల్లా ప్రధానస్థానంవహిస్తున్నది. పుగాకువ్యాపారాన్ని సక్రమపద్ధతిలోపెట్టి, పుగాకు మార్కెటింగువిధానం జయప్రదంగా సాగుటకు 1933 లో యేర్పడ్డ మద్రాసు మార్కెటింగు యాక్టుప్రకారం గుంటూరు జిల్లాలో 1940 లో 'పుగాకు మార్కెటింగు బోర్డు' ఏర్పడింది. వ్యాపారస్తులు, రైతులు, స్థానికసంస్థలు, తమ ప్రతినిధుల నెన్నుకుంటారు. ఈసంవత్సరం మార్చిలో జరిగిన యెన్నికల్లో 8 స్థానాల్లో గుంటూరుజిల్లా రైతుసంఘ అభ్యర్థులు 7 స్థానాలకు ఎన్నుకోబడ్డారు. జిల్లా రైతుసంఘాధ్యక్షుడు కొల్లా వెంకయ్యగారు చైర్‌మన్‌గా ఎన్నుకోబడ్డారు.

జిల్లాలో పుగాకు రైతుల, పంటను, వ్యాపారుల వ్యాపారాన్ని అభివృద్ధి పరచుకొనుటకు, పరస్పర సమాలోచనలు జరుపుటకు, మార్కెటింగు అధ్యక్షులు కమిటీ భవనంలో ఈనెల 1 వ తేదీని సంయుక్తసమావేశాన్ని ఏర్పాటుచేశారు. సమావేశానికి ఆంధ్ర రాష్ట్రరైతుసంఘకార్యదర్శి కామ్రేడ్ నండూరి ప్రసాదరావు అధ్యక్షతవహించాడు. రైతుల-వ్యాపారుల సమిష్టి ప్రయోజనాన్ని ఉద్దేశించుకొని యీ కమిటీ కృషిచేయగలదని ప్రసాదరావుగారు తమఆశను వెలిబుచ్చారు. ప్రభుత్వం నుంచి యింకా యెక్కువ హక్కులు సంపాదించుకోడానికి రైతుల, వ్యాపారస్తుల తోడ్పాటుతో కమిటీ ప్రయత్నం చేయగలదని చెప్పారు. పుగాకుకు మార్కెటింగ్‌సౌకర్యాలు యేర్పరచి, చిన్న వ్యాపారస్తులకు, రైతులకు పెద్దవ్యాపారస్తులు చేయుచున్న అన్యాయాలను అరికట్టి, చిన్నవ్యాపారస్తులకు రైతులకు లభించవలసిన లాభాలు పొందునట్లు కమిటీ కృషిచేయగలదని చెప్పారు. బొగ్గు, యెరువులు, బ్యారన్స్‌కు అవసరమయ్యే వస్తువులు తక్కువధరలకు రైతులకు సప్లయి చేయాలని కోరారు.

వ్యాపారస్తుల తరపున శ్రీ పువ్వాడ మృత్యుంజయుడుగారు మాట్లాడుతూ, మార్కెటింగు కమిటీ రైతులకుగాని, వ్యాపారులకుగాని, యింతవరకు యేమీ సహాయం చేయలేదనీ, 6 నెలలలోగా యేమీ చేయలేని పక్షంలో సభ్యులంతా రాజీనామా యివ్వడం మంచిదనీ చెప్పారు.

రైతుల తరపున శ్రీ రామిరెడ్డి, యర్రంనేని కోటేశ్వరరావు, గుర్రం లక్ష్మయ్య, పి. కోరయ్యగార్లు మాట్లాడుతూ కమిటీని రద్దుచేయమనడం మంచిదికాదనీ, మార్కెటింగు కమిటీ వచ్చిన తర్వాత కొంతవరకు రైతులకు లాభం కలిగిందనీ చెప్పారు. ఉన్నఅవకాశాన్ని ఉపయోగించుకొని లాభదాయకం చేసుకొనడమే రైతుల, వ్యాపారస్తుల కర్తవ్యమనికూడా చెప్పారు. జాతీయ ప్రభుత్వంలో యీ కమిటీ నిర్వహించవలసిన ప్రముఖపాత్రను గురించికూడా తెలియజేస్తూ, యింకా యెక్కువ హక్కులు కమిటీకి యివ్వమని ప్రభుత్వాన్ని కోరాలన్నారు.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు మాట్లాడుతూ కమిటీతరపున దేశంలోను, విదేశాల్లోను ప్రతినిధులుండాలనీ, వారి ద్వారా మార్కెటింగు ఆవరణకువచ్చిన పుగాకును విడుదలచేస్తే, రైతులకు, చిన్నవ్యాపారులకు లాభాలు లభింపగలవనీ, మార్కెటింగు సౌకర్యాలు ప్రజాయుత్తంగా అభివృద్ధికావలసిన యీ రోజులలో కమిటీరద్దుకావడం ప్రజాస్వామికానికి వ్యతిరేకమనీ, మార్కెటింగు పద్ధతివల్ల, ఇతరదేశాల్లో యెంతెంత లాభాలు కలిగాయో, ప్రజలకు కరపత్రాల ద్వారా, పత్రికలద్వారా తెలియజేయాలనీ చెప్పారు.

కమిటీసలహాదారు శ్రీ సర్వయ్య చెట్టిగారు, కార్యదర్శి యం. వెంకట్రామయ్యగారు, కమిటీ స్టాఫ్‌తరపున యం. కోటయ్యగారు, మాట్లాడుతూ ప్రజా సహకారంతో కమిటీ క్రొత్తమార్పులు తేగలదనీ, కమిటీ రద్దుకావలెననడం సరియైనది కాదనిచెప్పారు.

కమిటీ ఉపాధ్యక్షులు డి. వి. అప్పారావుగారు మాట్లాడుతూ పెద్దవ్యాపారస్తుల చేతిలోనున్న సర్టిఫయింగు బోర్డు మద్దివారికి సర్టిఫికెట్ యివ్వకపోతే, యితర దేశాలకు యెగుమతిచేయ వీలులేనప్పుడు, కమిటీ సర్టిఫికెట్టుతో యెగుమతిచేసి లాభం గడించడమే కమిటీ వ్యాపారస్థులకు చేసిన లాభమునకు ఉదాహరణ అన్నారు. చిన్నచిన్న వ్యాపారస్తులకు రక్షణ యివ్వడానికి కమిటీ యెల్లప్పుడూ సిద్ధంగా ఉన్నదనీ, అందులకు వర్తకుల, రైతుల సహకారం యివ్వవలసినదనీ కోరారు.

ఈదిగువ తీర్మానాలు జరిగాయి:

(1) పుగాకు బారన్‌లకు సప్లయిచేయుటకు బొగ్గును కమిటీకి సప్లయిచేయమని కేంద్రప్రభుత్వాన్ని కోరుటకూ; (2) పుగాకు పంటకు అవసరమైన యెరువులను రైతులకు అందించుటకు యీ కమిటీకి యివ్వవలసినదిగా మద్రాసుప్రభుత్వాన్ని కోరుతూ; (3) పుగాకు ఉత్పత్తిదారుల సహకారసంఘాలను రిజిష్టరుచేయవలసినదిగా సహకారశాఖవారిని కోరుటకూ; (4) పుగాకు వ్యాపారస్తులు లైసెన్సులు కోరితే తప్పకుండా యివ్వవలసినదనీ; (5) జిల్లాలో పుగాకురైతులకు బొగ్గు, యెరువులు, బారన్ సామానులు, సప్లయి చేయుటకు అవసరమైన పెట్టుబడికి 5 లక్షల రూపాయిలు అప్పుక్రింద యివ్వవలసినదిగా మద్రాసుప్రభుత్వాన్ని కోరుతూ, తీర్మానించారు.

★ మనరాజకీయాలు : కంభంపాటి సత్యనారాయణ ★

మహాత్ముని లేఖ

ఈమధ్య మహాత్ముడు జయకర్‌కువ్రాసిన జాబు చదువరులకు ఆశాభంగం కలిగించింది. "ఈ దౌర్బల్యస్థితినుండి నేను బయటపడగానే, తిరిగి నన్ను జైల్లో నిర్బంధిస్తారని నా అభిప్రాయం," అని మహాత్ముడు వ్రాశాడు. విదేశీ పరిపాలకుల చేతుల్లో తాను నిస్సహాయుడై ఉన్నట్లుగా భారతీయుల ఏకైక నాయకుడుభావించడం ఎవరిని కలవరపెట్టదు? ఏ జాతీయోద్యమాన్ని తాను నిర్మించి నడుపుతున్నాడో, దాని శక్తిని గుర్తించకపోవడం విచారించవలసిన విషయం. గాంధీజీని గురించి అమెరీములా చేసిన దుష్ప్రచారం యీ రోజున పూర్తిగా విఫలమైంది. చొరవతో ముందడుగువేయగలశక్తి యీనాడు మహాత్ముని చేతుల్లోవుంది. తిరిగి గాంధీజీని జైల్లో పెట్టడం ఎవరితరమూగాదు. మన దేశానికి యిప్పుడు లభించిన గొప్ప అవకాశం యిదే:

"నన్ను తిరిగి అరెస్టుచేయకపోతే, నేను చేయగలిగిందిమాత్రం ఏముంది? ఆగస్టు తీర్మానాన్ని ఉపసంహరించుకోవడం నాచేతుల్లో లేదు. మీరు చెప్పినట్లు, నేడది ఎట్టిహానిని కలుగజేయదు. తీర్మానంలోవున్న సూచనలను ప్రభుత్వం ఆమోదించకపోతే జరుపవలసిన కార్యవిధానాన్ని గురించి మీరు ఆమోదించకపోవచ్చు. కాని, అది నాకు ప్రాణతుల్యం."

అని మహాత్ముడు తెలియజేశాడు. ఆగస్టు తీర్మానాన్ని ఉపసంహరించుకోవడమా? మానడమా? అనే సమస్య నేడు ప్రధానం కానేకాదు. కాంగ్రెసుతో రాజీ అవసరమని కోరేవారెవరూ ఆతీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని పట్టుపట్టరు. ఇదే ప్రధానసమస్యగా పరిగణించడం అమెరీములా వన్నినవలలో పడడమే అవుతుంది.

ఐతే, గాంధీజీ దేశానికి చూపగలమార్గం ఏమిటి?

మొట్టమొదట, ఆగస్టు తీర్మానంలో కాంగ్రెసు ప్రకటించిన ఫాసిస్టు వ్యతిరేక వైఖరిని పునరుద్ఘాటించడం అవసరం. అమెరీములా యింతవరకూ గావించిన అసత్య ప్రచారానికి చెప్పుదెబ్బ కొట్టినట్లు సమాధానమిచ్చిననాడు, మన స్వాతంత్ర్యాన్ని కోరే ప్రపంచప్రజలతో తిరిగి సన్నిహితసంబంధం ఏర్పరచుకొని, అభివృద్ధి నిరోధకులైన సామ్రాజ్యవాదుల్ని దూరం చేయవచ్చు. బ్రిటన్ - భారతదేశాల మధ్య రాజీజరగాలని తమతమ ప్రభుత్వాలపై ఒత్తిడిచేసే బ్రిటిష్ - అమెరికన్ ప్రజలకు, అప్పుడు మరింత బలం చేకూరుతుంది.

ఇంతేకాదు. మన మాతృదేశంపై దాడి సల్పుతున్న జపాన్ ముష్కరులకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించడం అవసరం. జైల్లో వర్కింగుకమిటీసభ్యులు ఈ విషయమై ఏమనుకుంటున్నారో డాక్టర్ మహమూద్ లేఖవల్ల స్పష్టమయింది. గాంధీజీ అలాచేస్తే, మన ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించడమేగాకుండా బ్రిటిష్ ప్రజల ఆందోళనకు బలం చేకూర్చుతమవుతుంది.

మరోవిషయం ఏమంటే, జపాన్ సేనలు మనదేశ సరిహద్దులలో పోరుసల్పుతున్నప్పుడు శాసనోల్లంఘనం (హింసాయుతమైనట్టిదిగాని, అహింసాయుతమైనట్టిది గాని) యొక్క అర్థం, బ్రిటిష్‌ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకురావడంకాదు; జపాన్ సేనలకు ప్రత్యక్షంగా సహాయం చేయడం.

నేటిపరిస్థితుల్లో జాతీయప్రభుత్వ స్థాపనకు ఏకైకమార్గం కాంగ్రెసు - ముస్లిములీగులమధ్య ఐక్యత అనే విషయాన్ని మహాత్ముడు గుర్తించి, లీగ్‌పట్ల అపోహలను విడిచిపెట్టి, ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కును జాగ్రత్తగా పరిశీలించడం అవసరం.

గాంధీజీ వ్రాసిన లేఖలో యిట్టి కార్యాచరణ సూచనలు కనపడ్డంలేదు, ఇంకా మార్గాన్వేషిగానే ఉన్నాడు. ప్రజలలోను, కాంగ్రెసువాదులలోను, ఆశాభంగం వ్యాపిస్తోంది. మన శత్రువుల హృదయాలలో తిరిగి ఆశారేఖలు ఉదయిస్తున్నాయి.

ఉదాహరణకు, మహాత్ముడు తన "క్విట్ ఇండియా" తీర్మానాన్ని బలపరుస్తున్నట్లు జపాన్‌రేడియో వ్యాఖ్యానించుతోంది. ఆతీర్మానాన్నే సుభాష్‌బోసు ఆచరణలో పెడుతున్నాడని ప్రచారం చేస్తూంది. "టైమ్సు ఆఫ్ ఇండియా" వంటి సామ్రాజ్యవాద పత్రికలు బ్రిటిష్‌ప్రభుత్వాన్ని గాంధీజీ మళ్ళీ బెదిరిస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఈనెల 7వ తేదీని శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతి, శ్రీ సి. ఎన్. ముత్తురంగ మొదలియార్ గావించిన సంయుక్త ప్రకటనలో కూడా యిలాగే ఆగస్టు తీర్మానాన్ని ఉపసంహరించుకోవడమా, మానడమా? క్రిప్సు ప్రతిపాదనల నామోదించడమా, నిరాకరించడమా? మొదలైన అప్రధాన సమస్యలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. దేశరక్షణకై ప్రజలు నిర్వహించవలసిన కర్తవ్యమువిమో తెలియజేయలేదు. జాతీయప్రభుత్వస్థాపనకు కాంగ్రెసు - లీగు ఐక్యత ఎంత అవసరమో గుర్తించినట్లు లేదు. దేశాన్ని నేడెదుర్కొంటున్న ప్రధానసమస్యలు దేశరక్షణ, కరువు, జాతీయైక్యత మొదలైనవి. వీటిని పరిష్కరించడానికి దేశం గాంధీజీవైపు, కాంగ్రెసు నాయకులవైపు, చూస్తోంది. మహాత్ముడు త్వరలో ఆరోగ్యాన్ని కోలుకొని, ప్రజలకు పరిష్కారమార్గం చూపుతాడని ఆశిస్తున్నాం.

పంజాబ్‌లో ఎవరెవరిమధ్య సంఘర్షణ?

పంజాబు ప్రధాని మాలిక్‌ఖిజర్ హయత్‌ఖాన్ ముస్లింలీగు శిక్షణకు లోబడనందుకు "కౌన్సిల్ఆఫ్‌యాక్షన్" అతన్ని లీగునుంచి వెళ్ళగొట్టింది. అతనిఅనుచరులైన ముగ్గురు మంత్రులుముస్లింలీగుకు రాజీనామాయిచ్చారు. వీరితోబాటు 60 మంది శాసనసభాసభ్యులు కూడా ముస్లింలీగ్‌కు రాజీనామా యిచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. జిన్నా ప్రయత్నాలు విఫలమైనందుకు సంతోషిస్తూ జాతీయపత్రికలు వ్యాఖ్యానిస్తున్నాయి.

పంజాబులో నేడు జరిగే సంఘర్షణ కేవలం రెండు ముస్లిం పార్టీల మధ్య కలహం కానేకాదు, నిరంకుశాధివర్గానికీ, ముస్లిం ప్రజాసామాన్యానికి, మధ్యజరిగే పోరాటం యిది. యూనియనిస్టు మంత్రివర్గం పేరుతో పంజాబ్ ప్రధాని, అతని అనుచరులు జమీందారీ హక్కుల్ని కాపాడుతూ, నిరంకుశోద్యోగులకు తాళంవేస్తూ, పంజాబ్‌లో పెత్తనం చలాయిస్తున్నారు. ప్రజల సామాన్య పౌరసత్వ హక్కులకు భంగం కలిగిస్తున్నారు. నిలవవ్యాపారస్తుల పక్షం వహించి, కరువుతో బాధపడే యితరరాష్ట్ర ప్రజలకు తగినన్ని ఆహారపదార్థాలు చేరకుండా ఆటంకపరుస్తున్నారు. ఈ మంత్రివర్గం స్థానే ముస్లింలీగ్ మంత్రివర్గాన్ని యేర్పరచి, ప్రజాసామన్యాన్ని వీరి విషకౌగిలినుంచి తప్పించేటందుకు ముస్లింలీగ్ ప్రయత్నించింది. లీగ్ శిక్షణకు లోబడనందుకు పంజాబ్ ప్రధానిపై చర్యతీసుకొంది. దీనితో యూనియనిస్టు మంత్రివర్గం ముస్లింలీగ్ సభ్యులపై దాడి ప్రారంభించింది. రాజ్యాంగ యంత్రంలో తమకుగల అధికారాన్ని వీరు విచ్చలవిడిగా ప్రయోగిస్తున్నారు. లీగ్ ఎం.ఎల్.ఏ. లపై ఎన్నోవిధాల ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఉదాహరణకు, మాందూత్ నవాబ్ సరిగా ప్రవర్తించకపోతే అతని భూములన్నీ స్వాహా అవుతాయని పంజాబ్ ప్రధాని బెదిరించాడు. గవర్నరుచే డిస్మిసు చేయబడ్డ షౌకత్ హయత్‌ఖాన్‌పై కొత్తగా అనేక కేసులు బనాయించబడ్డాయి. ప్రభుత్వ జోహుకుంవాలాలైన యిద్దరిని కొత్త మంత్రివర్గంలోకి తీసుకున్నారు. పంజాబ్ ముస్లింలలో నానాటికీ వృద్ధిఅవుతున్న లీగ్‌పలుకుబడిని నాశనం చేయడానికి కమీషనర్లకు, డిప్యూటీ కమీషనర్లకు, వివరాలతోసహా ఉత్తరువులు జారీచేయబడ్డాయి.

ఈ దాడిని ఎదుర్కొంటూ ముస్లింప్రజాసామాన్యం తమసంస్థను (లీగ్) బలపరచుకొంటున్నారు. పంజాబ్ నిరంకుశాధికారవర్గంయొక్క యీదాడిని ఎదుర్కొనేటందుకు కాంగ్రెసు-లీగు ఐక్యతతప్ప మరొక మార్గంలేదు. పంజాబ్ కాంగ్రెసువాదులు యిందుకు తగినసన్నాహాలను ప్రారంభించవలసియుంది.

వార్తలు - విశేషాలు

● బెంగాల్ కరువునివారణనిధికి సొమ్ము వసూలుచేయడానికి లండన్‌లో యీ నెల 6వ తేదీని "భారత చిత్రకళా ప్రదర్శనం" తెరువబడింది. మిస్టర్ అగస్టస్‌జాన్ ప్రారంభోపన్యాసంగావిస్తూ యిలా చెప్పాడు; "భారతదేశ నాగరికత మన నాగరికతకంటె చాలా ఉత్కృష్టమైనది. వారి తత్వశాస్త్రం, చిత్రకళ, మనవాటికంటె ఎన్నోరెట్లు గంభీరమైి, ప్రపంచంలో అద్వితీయమైన స్థానాన్ని అలంకరిస్తున్నాయి."

● హెరాల్డ్ లాస్కీ, విక్టర్‌గొలాన్జ్, జూలియన్ హక్స్లీ, సి. యి. ఎం. జోడ్ మొదలైన 28 గురు బ్రిటిషు రచయితలూ, పత్రికా సంపాదకులూ అమెరీకి జాబువ్రాస్తూ గాంధీజీతోబాటు యితర కాంగ్రెసు నాయకులను కూడా విడుదలచేయవలసిందనికోరారు.

● బెంగాల్‌లో యీనాడు 2 కోట్లమంది ప్రజలు అంటువ్యాధులతో బాధపడుతున్నట్లు డాక్టరు బి. సి. రాయి (మెడికల్ రిలీఫ్ కో-ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు) ప్రకటిస్తున్నారు. వైద్యసహాయం, ధనసహాయం, విరివిగా పంపవలసిందని ప్రజలకు విజ్ఞప్తి గావిస్తున్నారు.

● అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు కామ్రేడ్ డాంగే, లండన్‌లో ఇండియా లీగ్ తరపున, వివిధ కార్మిక సంస్థల తరపున సన్మానించబడ్డారు.

● తిరువాన్కూరులో స్టేట్ కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీలు కలిసి పనిచేయడం తిరువాన్కూరు దివానుకు సహించరాని విషయమైంది. కమ్యూనిస్టుపార్టీవారు యీ మధ్య కార్మికుల్ని ఉద్రేక పరుస్తున్నారట! అనేక సందర్భాలలో స్టేట్ కాంగ్రెసుతో కలిసి పనిచేస్తున్నారట! అందువల్ల కమ్యూనిస్టుపార్టీని ఒక రాజకీయపార్టీగా పనిచేయనీయమని సర్ సి. పి. రామస్వామిఅయ్యర్ బెదరిస్తున్నాడు.

● దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ యాజమాన్యాన 10 వేలమంది భారతీయులు డర్బన్ (ముఖ్యపట్టణం) లో సమావేశమై, భారతీయుల ఆస్తి హక్కులకు భంగం కలిగించే కొత్త "లైసెన్సింగ్‌బోర్డు"కు వ్యతిరేకంగా ప్రదర్శనలు, తీర్మానాలు గావించారు.

● జూన్ 7 వ తేదీని స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షతక్రింద గుజరాత్ రైతుమహాసభ జరిగింది. గుజరాత్‌రాష్ట్రంలో ప్రజల నెదుర్కొంటున్న ఆహారసమస్యపై తీర్మానాలు గావింపబడ్డాయి.

జైల్లో వర్కింగ్ కమిటీ సభ్యులు ఏమనుకొంటున్నారు?

డాక్టర్ మహమూద్ కాంగ్రెసువర్కింగ్ కమిటీ సభ్యుడు. ఇతర సభ్యులతోబాటు జైల్లో డిటెన్యూగానిర్బంధించబడియున్నాడు. కమ్యూనిస్టుపార్టీలోచేరి పనిచేస్తున్న తన కుమారునికి (హబీబ్) డాక్టర్ మహమూద్ యీ క్రిందివిధంగా జాబువ్రాశాడు:

"జపానుసేనలు మనదేశంపై గావించిన దండయాత్ర నిన్నెక్కువగా కలవరపెట్టియుండాలి. దాన్ని మన మిత్రసేనలు తగినవిధంగానే ఎదుర్కొంటూ ఉండియుండాలి. ఎందువల్లనంటే, పూర్వపు ఆ సంసిద్ధత యిప్పుడు లేదు. ఐనా, యీ దాడి మమ్మల్ని ఎక్కువగా ఆందోళన పరచింది. ఇది మన దేశాన్ని పూర్తిగాస్వాధీనంచేసుకోడానికి జరిగే దండయాత్ర తప్ప మరొకటికాదని మా అభిప్రాయం.

"దీన్నెదుర్కొనేటందుకు ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించడం, వారి మనోనిబ్బరాన్ని కాపాడ్డం, చాలాఅవసరం. ప్రభుత్వంమీద మనకెంత ద్వేషం ఉన్నప్పటికి, కర్తవ్యనిర్వహణకది అడ్డురాకూడదు. ప్రభుత్వం పట్ల మాకెన్ని అభిప్రాయభేదాలున్నా, ఈ విషయంలో మాత్రం మేమంతా ఏకీభవిస్తున్నాం.

"ఇతరులకు నీవీ విషయం చెప్పవచ్చు: మా అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. బహుశా ప్రజల్లో అనేక దురభిప్రాయాలు వ్యాపించియుంటాయి. వాటికి కారణం ప్రభుత్వం మాకు వ్యతిరేకంగా చేసిన దుష్ప్రచారం తప్ప మరొకటికాదు. నువ్వు సంవత్సరంనుండి యీ విషయంలో కృషిచేస్తూనేవున్నావు."

నేటి పరిస్థితుల్ని గురించి వర్కింగ్ కమిటీ సభ్యులు ఏమనుకుంటున్నారో! అని ప్రజలు, దేశభక్తులు, కుతూహలపడుతున్నారు. వారేమనుకొంటున్నదీ యీజాబులో స్పష్టంగావుంది. సందేహాలకు, అనుమానాలకు, యిప్పుడు తావులేదు.

(12వ పేజీ తరువాయి) సేవ చేయాలన్నా, రైతుఉద్యమాన్ని బలపరచాలన్నా, కాంగ్రెసు సాంప్రదాయాలను నిలబెట్టాలన్నా, చేయవలసింది పోటీసంఘం పెట్టడంకాదు. కమ్యూనిస్టు ద్వేషప్రవాహములోబడి రైతుఉద్యమమును చీల్చవద్దు. యిప్పటివరకు పనిచేస్తున్న రైతుసంఘమునే బలపరచండి.

దెబ్బలాటకు కారకులెవరు?

పశ్చిమ గోదావరి పోటీ రైతుమహాసభ

పశ్చిమగోదావరిజిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి అన్నే వెంకటేశ్వరరావుగారు, సహాయకార్యదర్శి గారపాటి సత్యనారాయణ గారు ఇలా ప్రకటిస్తున్నారు :

ఈ నెల 3, 4 తేదీలల్లో పశ్చిమగోదావరి జిల్లా రైతుమహాసభ ఏలూరు తాలూకా పోతునూరులో, కల్లూరు సుబ్బారావు యం. యల్. ఏ. గారి అధ్యక్షతను జరిగింది. ఆ సభలో జరిగిన ఘర్షణ నిజానిజములు సభలో పాల్గొన్నవారికి, పోతునూరు వాస్తవ్యులకు తెలిసియేవున్నాయి. "కమ్యూనిస్టుల దౌష్ట్యం" అన్న శీర్షికక్రింద కల్లూరి సుబ్బారావుగారి పేరుతో కరపత్రం, దినపత్రికలలో స్టేటుమెంటులు, ఆంధ్రపత్రిక స్వకీయవిలేఖరి రిపోర్టు, నిజమును మరుగుపరుస్తూ, ప్రజలలో అపోహలకు దారితీయడంవల్ల, అచ్చట జరిగిన విషయములను తెలియపర్చుతున్నాం.

జిల్లా సంఘం

పశ్చిమగోదావరి జిల్లాలో రైతుసంఘాన్ని 1931 లోనే దంతు నారాయణరాజు, మాగంటి బాపినీడు, కీర్తిశేషులైన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగార్లు మొదలయిన వారు నిర్మించారు. రీసెటిల్మెంటు విధానానికి వ్యతిరేకంగా పనిచేసి అనేకమంది జైళ్ళకువెళ్ళి సంఘాన్ని నిలబెట్టి, సంఘగౌరవమును నిలబెట్టారు. రీసెటిల్మెంటు విధానాన్ని తాత్కాలికంగా ఆపుజేయించగలిగారు. 35, 36 సం॥లలో ఆదే రైతుసంఘం కీ॥ శే॥ సత్యనారాయణగారి ఆధ్వర్యమున పునర్నిర్మించబడ్డది. 1937 లో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం రిజిష్టరు కాబడింది. అప్పటినుంచి రాష్ట్రసంఘమునకు అధీన సంఘగా పనిచేస్తున్నది. 1940 లో, రైతు సేవకులను ప్రభుత్వము నిర్బంధంలో ఉంచిన కాలంలో సైతం, పసల కృష్ణమూర్తిగారి అధ్యక్షతను పనిచేస్తూనేఉంది. ఇంతకుముందే కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు పరమపదించడం జరిగింది. అప్పటికి పనిచేస్తున్న జిల్లాసంఘములకు సభ్యత్వ పుస్తకములీయక, వేరొక కమిటీని రంగాగారు నామినేటు చేశారు. కాని, ఆకమిటీ అప్పుడుగాని, తదుపరిగాని ఎన్నడూ పనిచేయనేలేదు. జిల్లా సంఘమేపని చేస్తూవచ్చింది. తర్వాత రంగాముఠావారు 1942 లో రాష్ట్రరైతుసంఘమును రద్దుచేయడం, అఖిలభారత కిసాన్‌సభనుంచి విడిపోవడం, జరిగింది. వెంటనే అఖిలభారత కిసాన్ సంఘంవారు చలసానివాసుదేవరావుగారిని ఆర్గనైజరుగావేసి. రాష్ట్రసంఘమును, జిల్లాసంఘములను, నిర్మించడం అందరికీ తెలిసిన విషయమే. మన జిల్లాసంఘం 1931 లో ప్రారంభమయి, తదాదిగా పనిచేస్తూ రైతులకు సేవజేస్తున్నది. కానూరు, పెంజ్యాల, దెందులూరు, స్కీములకొరకు ఆందోళన, కాల్వలతవ్వడం, ఎరువుల పంపకం, వగయిరాలుచేసి ప్రజాసేవచేస్తున్నది. నేడు 11 వేల సభ్యత్వం గల్గిఉంది.

వ్యతిరేకుల వైఖరి

ఇప్పటి పరిస్థితుల్లో రంగాముఠా వారయిన కొమ్మారెడ్డి సూర్యనారాయణ, కలగర కృష్ణారావు గారలు జైలునుంచి విడుదలయివచ్చారు. వచ్చినప్పటినుంచి పోటీ రైతుసంఘమును సృష్టించడానికి ప్రయత్నములు చేశారు. 27-4-44 వ తేదీన కొవ్వలి రైతుమహాసభనుగూర్చి చర్చించడానికి జరిగిన సమావేశములో పాల్గొని పోటీరైతుసంఘములు అవసరంలేదనీ, రైతులకు నష్టదాయకమనీ మనవిచేశాం. పైవారు రైతుసభ రైతుసమస్యలను చర్చించడానికి మాత్రమేనని, పోటీ సంఘంకొరకుకాదనీచెప్పుకున్నారు. అప్పుడు ఏర్పడిన ఆహ్వానసంఘంవారు కూడా ఆదే అభిప్రాయాన్ని వెల్లడించారు. ఏపార్టీకి వ్యతిరేకంగా సభజరుపమని చెప్పారు. కాని వీరు అందరూ చేసిన ప్రచారంగాని, ఏర్పాట్లుగాని, తద్విరుద్ధంగా సాగాయి.

పోతునూరు సభలో ఆదినుంచి అంతము వరకు రైతుఉద్యమముకు చీలిక తేడానికి విశ్వప్రయత్నం చేశారు. ముందు ఊరేగింపులో మమ్ములను గూడా పాల్గొనమని ఆహ్వానించారు. మేము ఎర్రజెండాలతో వెళ్లాము. ఈ జండా రైతుసభల అన్నిటిలోను ఉపయోగించ బడుతూనే ఉంది. కాని సభను ఏర్పాటుచేసిన ప్రభృతులు ఎర్రజెండాను ఊరేగింపులోకి తీసుకరాకూడదన్నారు. 3 రంగుల పతాకము మీద నాగలి, పార వేసిన జండాలు తాము నిర్ణయించామనీ, అవిమినహాయింకేవీ తీసుకరాకూడదన్నారు. చెప్పినా వినలేదు. వేరేమార్గంలేక తిరిగివచ్చాం. ఈ సమయంలో కలగర కృష్ణారావు, "కమ్యూనిస్టులతో రాయబారాలెందుకు? ఏదో ఒకటి తేల్చుకోడానికే వచ్చాము," అని బిగ్గరగా అరవడం అచట వున్నవారంతావిన్నారు. సభలో జాతీయ నాయకుల పటములను బెట్టారు. ఆంధ్రరాష్ట్రంలో రైతుసంఘములను రద్దుచేయడానికి మూలకారకులైన రంగా దంపతుల పటమును మాత్రం పెట్టారు. వీరుగాక యితర రైతు నాయకుల ఫొటోలు ఎచ్చటాలేవు. ఆంధ్రరాష్ట్ర రైతుఉద్యమనాయకుడైన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారి ఫొటోకూడా ఎచ్చటాలేదు. కాని, దేశద్రోహి సుభాసుబోసు ఫొటోమాత్రం తగిలించారు.

సభా ప్రారంభంనుంచి, కమ్యూనిస్టు వ్యతిరేకత, పోటీ రైతుసంఘ స్థాపన, గూర్చియే. కాశేశ్వరరావుగారివద్దనుంచి కమ్యూనిస్టులను, స్టాలినును నిందించుతూ వచ్చిన సందేశం చదివారు. అధ్యక్షులు ఉపన్యాసంలో కమ్యూనిస్టులను, ఆధారములేని ఆరోపణలు చేసి నిందించారు. రష్యా మాతృదేశమంటారన్నారు. వర్గపోరాటం పనికిరాదంటూ, జమీందారీ విధానము నశించాలన్నారు. స్టాలిను కమ్యూనిజాన్ని, హిట్లరు నాజీజాన్ని ఒకేమాదిరిగా ద్వేషిస్తానన్నారు. కమ్యూనిస్టులు దేశభక్తియుతంగా పనిచేయడం లేదన్నారు. తరువాత తీర్మానాలమీద చర్చలు జరిగాయి.

కయ్యానికి కాలుదువ్వటం

ఈసభలో మొదటనుంచీ పోటీరైతుసంఘంవారు కయ్యానికి కాలుదువ్వుతున్నారు. ఊరేగింపువద్ద జండానుగూర్చి చర్చించుతుంటే, కృష్ణారావు "అన్నిటికి సిద్ధమయి వచ్చాం; చూస్తారేంరా" అన్నారు. సభాసమయంలో మేము ఎవరమయినా మాట్లాడుతూంటే, అల్లరిని సద్దవలసిన వలంటీర్లే దుర్భాషలాడడం సాగించారు అదేమిటనిప్రశ్నించితే అప్పటికప్పుడు కర్రలకట్టలుతెప్పించి సభలోనే ఊడదీయించి, వాలంటీర్లకు యిప్పించారు. ఇంతేగాకుండా, నాయుడుగూడెం నుంచి గారపాటి కనకయ్యగారు రెండుబస్సులమీద షుమారు 60 మందిని తన అనుయాయులను తీసుకువచ్చారు. వీరు తన పొలములు సాగుఅయ్యే వరకు తన పైవారికిగాని, దిగువవారికిగాని నీరు వెళ్ళనీయకపోవడం ఆగ్రామం చుట్టుప్రక్కల రైతు లందరికీ తెలిసిని విషయమే. ఆవిషయంమీద స్థానిక కమ్యూనిస్టులుఆందోళన చేయుచున్నందున కనకయ్యగారికి కమ్యూనిస్టులపై ద్వేషం. అందుచే పోటీసంఘంవారికి సహాయంగా దెబ్బలాడటానికి డబ్బుఖర్చుపెట్టి 60 మందిని తీసుకొచ్చాడు.

సభలో మావిజ్ఞప్తి

కమ్యూనిస్టులను దుర్భాషలాడటం, రైతుఉద్యమాన్ని చీల్చడానికి ప్రయత్నించడం, కయ్యానికి కాలుదువ్వడం చూచి మేము ప్రతినిధులుగా ఎక్కువగా వెళ్లదలచలేదు. అందువల్లనే, జిల్లారైతుసంఘం తరఫున యిద్దరము మాత్రమే వెళ్లిమాదృక్పథం తెలియజేశాం. ధాన్యంధరలు, రేషనింగుమీద మాట్లాడాం. చివరకు ప్రస్తుతమున్న జిల్లారైతుసంఘం ప్రపోర్షనేటు డిస్పార్టీ పద్ధతిని బలపరుస్తున్నందున ఆసంఘంమీద విశ్వాసరాహిత్యం ప్రకటిస్తూ పోటీసంఘమును పెట్టాలని తీర్మానంతెచ్చారు 'ప్రపోర్షనేటు డిస్పార్టీ పద్ధతి ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించిన, సమస్యఒక జిల్లావారు దానినిరద్దుచేయమనడం, మరొక జిల్లావారు దానిని పెంచాలని ఆందోళన చేయడం వల్ల ఫలితం ఏమాత్రం ఉండదు. అంతేగాక అధికారుల చేతుల నింపడమే అవుతుంది. కోర్టులకు ఎక్కడం, మొదలయిన వాటిద్వారా రైతు ఉద్యమాన్ని బలహీనపర్చినవార మవుతాము. గాన రెండుజిల్లాల రైతులశ్రేయస్సుదృష్టిలో పెట్టుకునే బలపరుస్తున్నాము, తప్పుఅని ఒప్పించితే దిద్దుకుంటాం." అనిచెప్పాం. పోటీ రైతుసంఘం వలదనియు, తద్వారా చీలికలు తేవద్దనియు, మనలో భేదాభిప్రాయాలుంటే రైతుఉద్యమంలో చీలికలు తెచ్చి ఉద్యమానికే దెబ్బ గొట్టడం న్యాయంకాదనియు, జిల్లా సంఘంలోకివచ్చి నాయకత్వం వహించి నడిపితే మేము వారిక్రింద ఉండి పనిచేస్తామనిమనవిజేశాం. తరువాత మంగళంపల్లి చంద్రశేఖరరావుగారు మాట్లాడుతూ, 'రైతుసంఘం కమ్యూనిస్టుల బాబుసొమ్మా' అని పరుషవాక్యాలు మాట్లాడప్రారంభించారు. దీనిమీదసభలో గల్లంతు బయలుదేరింది.

వాలంటీర్ల దౌర్జన్యం


ఈగల్లంతులోఉండడంమంచిదికాదనిమావాళ్ళను బయటికిపంపించాం. కొందరినివెళ్లనిచ్చి గేటు మూసేశారు. సభలోనున్నవారిని కర్రలు మెడమీదవేసి తూర్పొబెట్టసాగారు వాలంటీర్లు ఇది మరింతగలభాకు దారితీసింది. ఈలోగా గేటువద్ద గలభాసాగితే అచ్చట ఆపడానికి పోయాం. సద్దుతున్న కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు టి కె. రామస్వామి గారిని కర్రతో తలబ్రద్దలు కొట్టారు. ఇరుపక్షాలకుగలాటా జరిగింది ఇరుపక్షాలకు దెబ్బలుతగిలాయి.

జరిగిన సంఘటనలు ఈ విధంగా ఉండే, సత్యాన్ని మరుగుపరుస్తూ కల్లూరు సుబ్బారావుగారు ఇచ్చిన స్టేటుమెంటుగాని, ఆంధ్రపత్రికస్వకీయవిలేఖరి యిచ్చిన రిపోర్టులుగాని, అచ్చట పాల్గొన్నవారిని ఎవరిని మోసపుచ్చలేవు ఇతరులలో మాత్రం దురభిప్రాయాలు కలుగచేయడానికి దారితీస్తాయి.

కాంగ్రెసు సాంప్రదాయం కాదు

సభలో ఈగలభా మాత్రమేగాకుండా, కాంగ్రెసు ప్రతిష్ఠను గంగపాలుచేశారు. బెజవాడ రామచంద్రారెడ్డిగారు కాంగ్రెసు రైతులకు ఏమీ చేయలేదన్నప్పుడునోరుమూసుకుఊరుకున్నారు. రీసెటిల్‌మెంటుపన్నులు వేయడానికిరంగాగారువిచారణసంఘకార్యదర్శి గాకముందువ్రాసినలెఖ్ఖలే కారణమన్నప్పుడూ ఊరుకున్నారు. కాంగ్రెసు ప్రముఖులందరు, రేషనింగు కావాలంటుంటే, వీరు వద్దన్నారు. పైగా దేశద్రోహి బోసు ఫొటోనుకూడా సభలో పెట్టారు! రైతునాయకులనే విస్మరించుతున్నారు. రైతుఉద్యమములో చీలికలు తెస్తున్నారు. ఈవిధంగా చేయడం కాంగ్రెసు సాంప్రదాయానికి విరుద్ధం. పైగా కమ్యూనిస్టులపై ద్వేషంతోఅసత్య ప్రకటనలుజేయడం, గాలికి ఎగిరి పోయిన అట్టలుకూడా వీరే ఎత్తుకపోయారనిప్రచారం చేయటం, వగయిరాలు రైతు ఉద్యమాన్ని బలపరచడంగాదు. కాంగ్రెసు సాంప్రదాయమూగాదు.

మేము సభలోచేసిన విన్నపాన్నే తిరిగి చేస్తున్నాం. రైతు (మిగతా 11 వ పేజీలో)



కాలువ తవ్వుపనిలో ఉదయభారతి విద్యార్థి బృందం

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE